

www.vibharenews.com

# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY

PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర్ రెడ్డి మంగళవారం 25 మే 2021 సంపుటి : 02 సంచిక :310 పేజీలు : 4 వెల : రూ 3-00

## ధూళిపాళ్ల నరేంద్రకు బెయిల్

గుంటూరు సంగం డెయిరీ కేసులో తెదేపా సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకు బెయిల్ మంజూరైంది. నరేంద్రతో పాటు సంగం డెయిరీ ఎండీ గోపాలకృష్ణన్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్పై విచారణ చేపట్టిన హైకోర్టు, ఈరోజు వారికి బెయిల్ మంజూరు చేసింది. నాలుడు వారాల పాటు విజయవాడ మున్సిపల్ పరిధిలోనే ఉండాలని, నివాసముంటున్న స్థలం చిరునామాను విచారణాధికారికి ఇవ్వాలని ఉన్నత న్యాయస్థానం సూచించింది. విచారణకు 24 గంటల ముందు విచారణాధికారి నోటీసు ఇవ్వాలని హైకోర్టు స్పష్టం చేసింది.

# యాస్ తుపాను, పరిస్థితులపై కేంద్ర హోం మంత్రి అమిత్షా వీడియో కాన్ఫరెన్స్

### క్యాంప్ కార్యాలయం నుంచి వర్చువల్గా సమావేశంలో పాల్గొన్న సీఎం జగన్



అమరావతి:తుపాను కదలికలను పరిశీలిస్తే రాష్ట్రంపై యాస్ ప్రభావం స్వల్పంగా ఉండే అవకాశాలున్నాయి. పరిస్థితులను అంచనా వేసుకుని ముందుకు సాగుతామని ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అన్నారు. మే 22న కేంద్ర కేబినెట్ సెక్రటరీ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సుకు అన్ని విభాగాల అధికారులు హాజరయ్యారు. తుపానును ఎదుర్కోవడానికి ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా ఉందని అయన అన్నారు. కేంద్ర హోం మంత్రి వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో సీఎం యాస్ తుపాను వల్ల ఉత్పన్నమయ్యే పరిస్థితులు, తీసుకోవాల్సిన చర్యలను సమీక్షించారు. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల యంత్రాంగాలను అప్రమత్తం చేశామని సమావేశంలో అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా సీఎం మాట్ఆడుతూ తుపాను వల్ల కోవిడ్ రోగులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలి. ఆక్సిజన్ సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా జాగ్రత్త పడాలి. తుపాను పరిణామాలను ఊహించి ఆ మేరకు సిద్ధం కావాలి. ఆక్సిజన్ ఉత్పత్తి చేస్తున్న ప్లాంట్లకు విద్యుత్ సరఫరాలో ఎలాంటి అవాంతరాలు లేకుండా చూడాలి. ఆక్సిజన్ సిలెండర్లకు, రీఫిల్లింగ్ చేసే ప్లాంట్లకూ విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని అన్నారు. ఆస్పత్రులకు కరెంటు సరఫరాలో ఇబ్బందులు లేకుండా డీజిల్ జనరేటర్లు ఏర్పాటు చేయాలని, ప్రత్యేకంగా విద్యుత్ సిబ్బందిని ఆయా ఆస్పత్రులకు కేటాయించాలని సీఎం ఆదేశించారు. తుపాను కారణంగా ఒడిశా ప్లాంట్ల నుంచి ఆక్సిజన్ సేకరణకు ఇబ్బందులు వస్తే ప్రత్యామ్నాయాలు సిద్ధం చేసుకోవాలని నిర్దేశం. ఆ మేరకు ఇప్పటికే సిద్ధంగా ఉన్నామని అధికారులు వెల్లడించారు.ఆక్సిజన్ తగినంత నిల్వలు పెట్టుకోవాలి. తుపాను ప్రభావిత రోజుల్లో ఆక్సిజన్ కొరత రాకుండా అధికారులు తదేక దృష్టి పెట్టాలి. ముందు జాగ్రత్తగా వారిని తరలించాల్సిన పరిస్థితులు ఉంటే వెంటనే ఆ చర్యలు తీసుకోవాలని సీఎం అన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో కోవిడ్ పేషెంట్ల తరలింపు అవసరం అనుకుంటే, ఇప్పుడే ఆ పని చేయాలి. కోవిడ్ కరెంటు సప్లైకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఒకటికి రెండు సార్లు పూర్తిస్థాయిలో ఆలోచనలు చేసి సమర్థవంతగా చర్యలు తీసుకోవాలి. అవసరమైన సాంకేతిక సిబ్బందిని సిద్ధంగా ఉంచుకోవాలి. విద్యుత్ పంపిణీ వ్యవస్థను పునఃసమీక్షించుకుని అందుకు తగిన విధంగా చర్యలు తీసుకోవాలి. అవసరమైన చోట్ల లోతట్టు ప్రాంతాల నుంచి ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించాలని ఆదేశించారు. శ్రీకాకుళం జిల్లాలో లోతట్టు ప్రాంతాల నుంచి ప్రజల తరలింపు వెంటనే ప్రారంభం కావాలి. సహాయ శిబిరాల్లో నిత్యావసరాలు మొదలు, అన్ని సదుపాయాలు ఉండేలా చూసుకోవాలి. కొవిడ్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తగిన చర్యలు తీసుకోవాలని అయన అన్నారు.ఈ కార్యక్రమానికి హోంశాఖ మంత్రి మేకతోటి సుచరిత, సీఎస్ ఆదిత్యనాథ్దాస్, డీజీపీ గౌతమ్ సవాంగ్, వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి అనిల్కుమార్ సింఘాల్, రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి ఎం టీ కృష్ణబాబు, విపత్తు నిర్వహణ శాఖ ముఖ్య కార్యదర్శి వి.ఉషారాణి, ఇంధన శాఖ కార్యదర్శి ఎన్.శ్రీకాంత్, విపత్తు నిర్వహణ శాఖ కమిషనర్ కె.కన్నబాబు తదితరులు హాజరయ్యారు.

# అధికారులు అప్రమత్తంగా ఉండాలి




తాడేపల్లి: యాస్ తుపాను వల్ల ఉత్పన్నమయ్యే పరిస్థితులు, తీసుకోవాల్సిన చర్యలపై సోమవారం తన క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి సమీక్ష నిర్వహించారు. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో అధికారులను అప్రమత్తం చేశామని ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు.తుపాను వల్ల కోవిడ్ రోగులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని సీఎం వైఎస్ జగన్.. అధికారులను ఆదేశించారు. ముందు జాగ్రత్తగా వారిని తరలించాల్సిన పరిస్థితులు ఉంటే వెంటనే చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. ఆక్సిజన్ ఉత్పత్తి చేస్తున్న ప్లాంట్లకు విద్యుత్ సరఫరాలో ఎలాంటి అవాంతరాలు లేకుండా చూడాలని సీఎం ఆదేశించారు. ఆక్సిజన్ సిలెండర్లకు రీఫిల్లింగ్ చేసే ప్లాంట్లకూ విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని సీఎం సూచించారు. ఆస్పత్రులకు కరెంటు సరఫరాలో ఇబ్బందులు లేకుండా డీజిల్ జనరేటర్లు ఏర్పాటు చేయాలని, ప్రత్యేకంగా విద్యుత్ సిబ్బందిని ఆయా ఆస్పత్రులకు కేటాయించాలని సీఎం ఆదేశించారు.తుపాను కారణంగా ఒడిశా ప్లాంట్లనుంచి ఆక్సిజన్

### యాస్ తుపాను వల్ల ఉత్పన్నమయ్యే పరిస్థితులపై సీఎం వైఎస్ జగన్ సమీక్ష

సేకరణకు ఇబ్బందులు వస్తే ప్రత్యామ్నాయాలు సిద్ధం చేసుకోవాలన్నారు. తగినంత నిల్వలు పెట్టుకోవాలని అధికారులకు సీఎం ఆదేశించారు. తుపాను ప్రభావిత రోజుల్లో ఆక్సిజన్ కొరత రాకుండా అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టాలని సీఎం అన్నారు. ఆక్సిజన్ సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. తుపాను పరిణామాలను ఊహించి ఆ మేరకు సిద్ధం కావాలని సీఎం సూచించారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో కోవిడ్ పేషెంట్లను అవసరమనుకుంటే.. తరలింపు ఇప్పుడే పూర్తికావాలని తెలిపారు."కోవిడ్ కేంద్రాలకు కరెంటు సప్లైకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఒకటికి రెండు సార్లు పూర్తి స్థాయిలో ఆలోచనలు చేసి సమర్థవంతగా చర్యలు తీసుకోవాలి. అవసరమైన సాంకేతిక సిబ్బందిని సిద్ధంగా ఉంచుకోవాలి. విద్యుత్ పంపిణీ వ్యవస్థను పునఃసమీక్షించుకుని అందుకు తగిన విధంగా చర్యలు తీసుకోవాలి. అవసరమైన చోట్ల లోతట్టు ప్రాంతాలనుంచి ప్రజలను తరలించాలనివవ సీఎం వైఎస్ జగన్ ఆదేశించారు.

# ముంచుకొస్తున్న 'యాస్ ముప్పు



న్యూఢిల్లీ : యాస్ తుఫాను ముప్పు ముంచుకు వస్తున్నది. తూర్పు మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారింది. బుధవారం ఉదయం అతి తీవ్ర తుఫాన్గా మారి పశ్చిమ బెంగాల్, ఉత్తర ఒడిశా తీరాన్ని దాటుతుందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) పేర్కొంది. ప్రస్తుతం ఉత్తర, వాయువ్య దిశగా కదులుతున్న వాయుగుండం సోమవారం తుఫానుగా మారుతుందని, ఆ తర్వాత 24 గంటల్లో తీవ్ర తుఫానుగా మారుతుందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. 26వ తేదీ నాటికి ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్ మధ్యలో ఉన్న పారాదీప్ దీవుల్లో తీరం దాటుతుందని తెలిపింది.వాయుగుండం కారణంగా ఇప్పటికే అండమాన్ నికోబార్ దీవుల్లో వర్షాలు కురుస్తున్నాయి. తుఫాను నేపథ్యంలో సోమవారానికి మధ్య బంగాళాఖాతంలో గంటకు 65 నుంచి 85 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. తీరం దాటేదాకా గంటకు 90-110 కిలోమీటర్ల వేగంతో, తీరం దాటే సమయంలో 155-165 నుంచి 185 కిలోమీటర్ల వరకు వేగంతో గాలులు వీస్తాయని పేర్కొన్నారు. తుఫాను నేపథ్యంలో మధ్య, ఉత్తర బంగాళాఖాతం, ఒడిశా, పశ్చిమ బెంగాల్, బంగ్లాదేశ్ తీరాల్లో సముద్రం అల్లకల్లోలంగా, అసాధారణంగా మారుతుందని తెలిపారు. సోమవారం అండమాన్ నికోబార్ దీవుల్లో అలలు మీటర్ నుంచి రెండు మీటర్ల వరకూ ఎగసిపడతాయన్నారు. మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లొద్దని అధికారులు సూచించారు.తుఫాను నేపథ్యంలో ఆదివారం ప్రధాని నరేంద్ర మోదీ ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రభావిత ప్రాంతాల ప్రజలను ఖాళీ చేయించాలని సూచించారు. మరో వైపు నేవీ సైతం నాలుగు యుద్ధ నౌకలను అందుబాటులో ఉంచగా.. సాయుధ బలగాలు సైతం అప్రమత్తంగా ఉంచినట్లు అధికారులు తెలిపారు. యాస్ తుఫానును ఎదుర్కొనేందుకు భారత వైమానిక దళం 11 విమానాలు, 25 హెలికాప్టర్లను సిద్ధంగా ఉంచింది. ఎన్డీఆర్ఎఫ్ సైతం 334 బృందాలను కోల్కతా, పోర్ట్ బ్లెయిర్కు ఆదివారం పంపింది. ప్రస్తుతం ఉన్న వనరులను పెంచేందుకు ఎనిమిది వరద సహాయ బృందాలను, నాలుగు డైవింగ్ బృందాలను ఒడిశా, బెంగాల్ వద్ద మోహరించినట్లు నావికా దళం తెలిపింది.

### రోజువారీగా తగ్గుముఖం పడుతున్న

# కరోనా కేసులు



న్యూఢిల్లీ మే 24 దేశంలో కరోనా మరణ మృందం మోగిస్తున్నది. గడిచిన కొద్ది రోజులు కరోనా రోజువారీ కేసులు కాస్త తగ్గుముఖం పడుతున్నా.. మరణాల సంఖ్య మాత్రం తీవ్ర ఆందోళనలు రేకెత్తిస్తున్నది. తాజాగా దేశంలో 2.22లక్షల కొవిడ్ కేసులు నమోదవగా.. మరోసారి మరణాలు 4వేలు దాటాయి. కొత్తగా నమోదైన మరణాలతో దేశంలో కరోనా మరణాలు మూడులక్షల మార్క్ను దాటాయి. కరోనా మరణాల్లో భారత్ ప్రపంచంలో మూడోస్థానంలో కొనసాగున్నది. అమెరికా, బ్రెజిల్ తొలి రెండుస్థానాల్లో ఉన్నాయి.దేశంలో గడిచిన 24 గంటల్లో 2,22,315 పాజిటివ్ కేసులు నమోదయ్యాయని కేంద్ర కుటుంబ, ఆరోగ్యమంత్రిత్వశాఖ సోమవారం తెలిపింది. మరో వైపు రోజువారీ కేసుల కంటే భారీగానే బాధితులు వైరస్ నుంచి కోలుకుంటున్నారు. నిన్న 3,02,544 మంది బాధితులు డిశ్చార్జి అయ్యారని మంత్రిత్వశాఖ పేర్కొంది. 24 గంటల్లో మరో 4,454 మంది ప్రాణాలు కోల్పోయారు. తాజాగా నమోదైన కేసులతో దేశంలో మొత్తం పాజిటివ్ కేసుల సంఖ్య 2,67,52,447కు పెరిగింది. ఇప్పటి వరకు 2,37,28,011 మంది బాధితులు కోలుకున్నారు.వైరస్ బారినపడి మొత్తం 3,03,720 మంది ప్రాణాలు వదిలారు. ప్రస్తుతం దేశంలో 27,20,716 యాక్టివ్ కేసులున్నాయని చెప్పింది.

ప్రస్తుతం దేశంలో రికవరీ రేటు 88.30శాతం, మరణాలు రేటు 1.13శాతం ఉందని మంత్రిత్వశాఖ చెప్పింది. టీకా డ్రైవ్లో ఇప్పటి వరకు 19,60,51,962 డోసులు వేసినట్లు ఆరోగ్యమంత్రిత్వ శాఖ వివరించింది. ఇదిలా ఉండగా.. నిన్న ఒకే రోజు దేశవ్యాప్తంగా 19,28,127 కరోనా పరీక్షలు నిర్వహించినట్లు ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) తెలిప్పింది. ఇప్పటి వరకు 33,05,36,064 శాంపిల్స్ పరీక్షించినట్లు వివరించింది.


# ఈ రాజారెడ్డి రాజ్యాంగం చెత్తబుట్టలో పడేస్తాం: లోకేష్

విశాఖ: ఇటీవల మృతిచెందిన డాక్టర్ సుధాకర్ కుటుంబాన్ని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చేది తెలుగుదేశం ప్రభుత్వమని, ఈ రాజారెడ్డి రాజ్యాంగం చెత్తబుట్టలో పడేస్తామని అన్నారు. ఏ అధికారులయితే రాజారెడ్డి రాజ్యాంగం అమలు చేస్తున్నారో.. వారు రాబోయే రోజుల్లో చాలా ఇబ్బందులు పడబోతున్నారని హెచ్చరించారు.డాక్టర్ సుధాకర్ చేసిన తప్పేంటని లోకేష్ ప్రశ్నించారు. 14 నెలలు ఆయనను సస్పెండ్ చేశారని, మాస్కులు అడగడమే ఆయన చేసిన తప్పా అని ప్రశ్నించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎవరు పోరాడినా.. ప్రశ్నించినా.. వాళ్లపై దొంగ కేసులు పెట్టి.. ఇబ్బందులకు గురిచేస్తే ప్రతిపక్ష పార్టీగా మాట్లాడకూడదా? అని ప్రశ్నించారు. సుధాకర్కు అన్యాయం జరిగితే ఒక్క దళిత మంత్రి కూడా మాట్లాడలేదని లోకేష్ విమర్శించారు. ఇప్పటికైనా వాస్తవాలు తెలుసుకుని డాక్టర్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సుధాకర్ది గుండెపోటు కాదని, ప్రభుత్వ హత్యేనని అన్నారు. డాక్టర్ కుటుంబానికి కోటి రూపాయల పరిహారం ఇవ్వాలని నారా లోకేష్ డిమాండ్ చేశారు.



# టీడీపీ నేతల హౌస్ అరెస్టు లను తీవ్రంగా ఖండిస్తున్నాం

### ప్రజల ప్రాణాలు పోతున్నా ముఖ్యమంత్రి తాడేపల్లి ప్యాలెస్ గడప దాటడం లేదు
### నారా చంద్రబాబు నాయుడు



అమరావతి రాష్ట్రంలోప్రజాస్వామ్యాన్ని,పౌరహక్కుల్ని హరించే విధంగా ముఖ్యమంత్రి జగన్ నిరంకుశ పాలన సాగిస్తున్నారు. ప్రశ్నించే గొంతులు ఉండకూడదు అన్న విధంగా వ్యవహరిస్తున్నారు.రాష్ట్రంలోని కరోనా ఆస్పత్రులను సందర్శించనున్న టీడీపీ నేతలను హౌస్ అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నామని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు.. కరోనా రోగులకు ధైర్యం చెప్పి ఆసుపత్రుల్లో ప్రజలకు అందుకున్న చికిత్స, సౌకర్యాలను పరిశీలించేందుకు టీడీపీ నాయకులు వెళ్తే ప్రభుత్వనికి వచ్చిన నష్టమేంటి? రాష్ట్రంలో సరైన వైద్యం అందక ప్రజలు చనిపోతున్నా.. ముఖ్యమంత్రి గడప దాటి బయటకు రాడని విమర్శించారు. ప్రజలకు భరోసా ఇచ్చేందుకు టీడీపీ నేతలు వెళ్తుంటే మాత్రం అరెస్ట్ చేస్తారా? ముఖ్యమంత్రి ఆసుపత్రులను ఎందుకు సందర్శించడం లేదు? ప్రజల ఆరోగ్యం పట్ల ముఖ్యమంత్రికి బాధ్యత లేదా? ఏడాది నుండి కరోనా విలయతాండవం చేస్తున్నా ఆరోగ్యరంగంలో మౌలిక సదుపాయాలు మెరుగు పర్చడానికి చేసింది శూన్యం. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందులు లేవు, 45 ఏళ్ళు నిండిన వారికి ఇంకా పూర్తి స్థాయిలో వ్యాక్షిన్ ఇవ్వలేదు.నిరుపేద రోగుల నుంచి లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్న ప్రవేట్ ఆసుపత్రులపై నియంత్రణ చర్యలు లేవు.

# ఆనందయ్య మందుపై అపోహలొద్దు: ఆళ్ల నాని

పశ్చిమ గోదావరి: రాష్ట్రంలో బెడ్ల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి ఆదేశించారని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఆళ్ల నాని తెలిపారు. ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో జర్మన్ షెడ్ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో 30 బెడ్లను ఏర్పాటు చేసి, ఆక్సిజన్ కాన్సంట్రేటర్స్ కూడా అందుబాటులో ఉంచామని ఆళ్ల నాని పేర్కొన్నారు.నాలుగు రోజుల క్రితం సీఎం జగన్ అధ్యక్షతన ఆనందయ్య మందుపై చర్చించామని, ఇప్పటికే కమిటీ వేసి పూర్తి స్థాయిలో



అధ్యయనం జరుగుతోందని మంత్రి తెలిపారు. పూర్తి స్థాయిలో నివేదిక వచ్చిన తర్వాత నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. ఆనందయ్య మందుపై ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ లేవని.. ఎలాంటి అపోహలు వద్దని ప్రజలకు మంత్రి సూచించారు. టీడీపీ నేతలు బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారని.. టీడీపీ నేతల తీరుపై ప్రజలు అసహ్యించుకుంటున్నారని మంత్రి ఆళ్ల నాని మండిపడ్డారు.

# సంపాదకీయం

మంగళవారం 25 మే 2021

## కయ్యానికి కాలు దువ్వుతున్న చైనా

ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశంగా గుర్తింపు పొందిన చైనా డజనుకు పైగా దేశాలతో సరిహద్దులను పంచుకుంటోంది. దాదాపు ప్రతి దేశం తోనూ దానికి కయ్యమే. ఇక భారత్ తో పరిస్థితి గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. మూడువేలకు పైగా కిలోమీటర్ల సుదీర్ఘ సరిహద్దును నిత్యం వివాదాస్పదంగా మార్చడంలో దాని తీరే వేరు. ఎప్పుడూ ఏదో ఒక పేరుతో రెండు దేశాల మధ్య సరిహద్దుగా పిలిచే వాస్తవాధీన రేఖ (ఎల్ఏసీ-లైన్ ఆఫ్ యాక్చువల్ కంట్రోల్) వద్ద ఉద్రిక్తతలకు ఊపిరిలూదడం బీజింగ్ నైజం. గతఏడాది తూర్పు లద్దాఖ్లో సరిహద్దులను యుద్ధభూమిగా మార్చింది. నాటి ఘటనల్లో 22 మందికి భారతీయ జవాన్లు అమరులయ్యారు. ఆ దేశానికీ అంతే స్థాయిలో నష్టం జరిగినప్పటికీ ఆ విషయం చెప్పుకోలేదు. తరవాత సరిహద్దుల్లో కృత్రిమ గ్రామాల నిర్మాణం, ఎగువనున్న బ్రహ్మపుత్ర నదీ జలాలను బిగపట్టడం వంటి చర్యల ద్వారా భారత్ ను ఇరుకున పెట్టింది. భారత్ సరిహద్దుల్లోని టిబెట్ లో అత్యాధునిక సౌకర్యాలతో 5జి సిగ్నల్ స్టేషన్ నెలకొల్పింది. ఇది భారత్, భూటాన్ సరిహద్దులకు అత్యంతసమీపంలోనే ఉండటం గమనార్హం. ఈ స్టేషన్ ద్వారా భారత్ పై బీజింగ్ కవ్వింపులకు దిగుతోంది. ఒకప్పటి స్వతంత్ర దేశమైన టిబెట్ ను చైనా ఆక్రమించుకుని దానికి స్వయం ప్రతిపత్తి కల్పించింది. టిబెట్ మన దేశంలోని అరుణాచల్ ప్రదేశ్ కు అతి సమీపంలో ఉంటుంది. ఇప్పుడు టిబెట్ లోని నాగర్జ్ కౌంటీలో 5జీ సిగ్నల్ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ప్రపంచంలోనే అత్యధిక ఎత్తులో (5,374 మీటర్లు) దీనిని నిర్మించింది. గన్ బాలా రాడార్ స్టేషన్ వద్ద దీనిని నిర్మించింది. భారత సైనిక స్థావరాలకు, సరిహద్దులకు అతి సమీపంలో ఇది ఉండటం గమనార్హం. 5జీ సిగ్నల్ కేంద్రం ఏర్పాటు వల్ల చైనాకు ప్రయోజనమన్న సంగతిని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. దీనివల్ల చైనా సైన్యానికి అధునాతన, అత్యంత వేగవంతమైన కమ్యూనికేషన్ సౌకర్యాలు లభిస్తాయి. కొండలు, గుట్టలు, పర్వతాల మయంగా ఉండే సరిహద్దుల్లో సైనికులకు ఏ సమాచారం చేరవేయాలన్నా, సందేశం పంపాలన్నా ఇబ్బందిగా ఉండేది. అరకొర, అస్పష్ట సమాచారం అందేది. ఇప్పుడు ఆ సమస్య తొలగిపోయింది. మారుమూల ప్రాంతాల్లో గస్తీ కాసే జవానుకు కూడా ఇక నుంచి తక్షణం విషయాన్ని సులభంగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా తెలియజేయవచ్చు. అదే సమయంలో భారతీయ జవాన్ల కార్యకలాపాలపై ఓ కన్నేసి ఉంచే సౌకర్యం కలుగుతుంది. సరిహద్దుల్లోని భారతీయ సైనిక శిబిరాలు, వాటి శిక్షణ కార్యకలాపాల తీరుతెన్నుల గురించి కొంతవరకైనా తెలుసుకునే అవకాశం ఈ సిగ్నల్ కేంద్రం వల్ల కలుగుతుంది. 5జీని భారత్ అధికారికంగా ఇంకా ఆమోదించలేదు. అయితే భద్రతా అవసరాల మేరకు దీనిని మున్ముందు ఆమోదించే అవకాశం ఉంది. సాధారణంగా ఏ దేశమైనా సరిహద్దుల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తుంది. ఇందులో భాగంగా రహదారులు, వంతెనలు, చిన్నపాటి విమానాశ్రయాలు, హెలిప్యాడ్లు నిర్మిస్తాయి. వీటివల్ల అత్యవసర సమయాల్లో సైనికులు, ఆయుధాలు, ఇతర రక్షణ సామగ్రి తరలింపునకు సౌకర్యంగా ఉంటుంది. మౌలిక వసతులతోపాటు ఈ నిర్జన ప్రదేశాల్లో కనీస కమ్యూనికేషన్ సౌకర్యాలను కల్పిస్తాయి. పాకిస్థాన్, బంగ్లాదేశ్ సరిహద్దుల్లో చొరబాట్ల నియంత్రణకు పటిష్టమైన కంచెలను భారత్ నిర్మించింది. భూటన్ ,మయన్మార్, నేపాల్ వంటి మిత్రదేశాల సరిహద్దుల్లో కేవలం చెక్ పోస్టుల ఏర్పాటుకే భారత్ పరిమితమైంది. తీరప్రాంత సరిహద్దు గల శ్రీలంకతో సముద్ర గస్తీకే పరిమతమైంది. చైనా తాజా చర్యలతో భారత్ సైతం అదేస్థాయిలో దీటుగా స్పందించాల్సిన అవసరం ఉంది.

## ఆలపాటి తెనాలికి దూరమవుతున్నారా...

గుంటూరు, మే 24, (న్యూస్ పల్స్)గుంటూరు జిల్లా అంటేనే టీడీపీకి కంచుకోట అనే మాట వినిపిస్తుంది. ఈ జిల్లాలో చాలా నియోజకవర్గాల్లో టీడీపీ పట్టు సాధించింది. రెండు దశాబ్దాలుగా ఆయా నియోజకవర్గాల్లో గెలుస్తూనే ఉంది. ఇలాంటి నియోజకవర్గాల్లో తెనాలి ఒకటి. ఇక్కడ పార్టీ ఆవిర్భవించిన తర్వాత.. మొత్తం ఐదు సార్లు టీడీపీ విజయం దక్కించుకుంది. ఈ క్రమంలోనే ఆలపాటి రాజేంద్రప్రసాద్.. ఉరఫ్ రాజా 15 ఏళ్లుగా తెనాలిని తన అడ్డాగా మార్చుకున్నారు. గతంలో వేమూరు నుంచి గెలిచిన ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆ సీటు ఎస్సీలకు రిజర్వ్ కావడంతో తెనాలికి మారారు. 2009లో ఇక్కడ ఓడిన ఆయన .. 2014లో విజయం సాధించారు. పార్టీని కూడా బలోపేతం చేశారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. గత ఎన్నికల్లో ఇక్కడ వైసీపీ విజయం దక్కించుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా జగన్ సునామీ.. వైసీపీ తుఫాన్ నేపథ్యంలో ఇక్కడ టీడీపీ పరాజయం పాలైంది. గెలుపు, ఓటములు సహజం అని అనుకున్నా.. వాస్తవానికి ఇక్కడ పార్టీని బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. కానీ, ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాత్రం.. ఇప్పుడు రాష్ట్ర రాజకీయాలపై దృష్టి పెట్టారనే వాదన వినిపిస్తోంది. ఆయన ఎక్కడ ప్రెస్ మీట్ పెట్టినా.. ఏసభా వేదిక ఎక్కినా.. లోకల్ సమస్యలను ప్రశ్నించడం లేదు. లోకల్‌గా ఉన్న ప్రజలను కూడా ఆయన పట్టించుకోవడం లేదు. కేవలం రాష్ట్ర స్థాయి రాజకీయాలు.. జాతీయ నేతలను విమర్శించడం వంటివరకే పరిమితం అవుతున్నారు. జిల్లా కేంద్రంలో ఆయన అప్పుడప్పుడు హడావిడి చేస్తున్నా తెనాలి కేడర్‌కు దూరం కావడంతో స్థానికంగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ హవా తగ్గుముఖం పట్టిందని పార్టీ నేతలే చర్చించుకుంటున్నారు. ఇటీవల జరిగిన స్థానికసంస్థల ఎన్నికల్లో తెనాలిలో అధికార పార్టీ నేతల దూకుడుతో టీడీపీ నాయకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా వైశ్య, బ్రాహ్మణ సామాజిక వర్గాల్లో ఆలపాటి రాజేంద్రప్రసాద్‌పై వ్యక్తిగత వైరుధ్యం పెరగడం ఆయనకు మైనస్ అయ్యింది. ఇటీవల ఎన్నికల్లో పోటీ చేసిన టీడీపీ నేతలపై వైసీపీ నేతలు దాడులు చేయడం.. పోలీసులతో కేసులు పెట్టించడం వంటివి చేశారు.. దీంతో వారంతా తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ.. మీడియా ముందుకు వచ్చారు. ఈ సమయంలో కూడా మాజీ ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్రప్రసాద్ వారిని పెద్దగా పట్టించుకోలేదు.

కేవలం నాలుగు ధైర్య వచనాలు చెప్పి వెళ్లిపోయారు. ఆ తర్వాత పోలీసులు కేసులు నమోదు చేయడం షరా మామూలే అన్నట్టుగా మారిపోయింది. ఆలపాటి రాజేంద్రప్రసాద్ గుంటూరులోనే మకాం వేసి తెనాలికి అప్పుడప్పుడు వస్తుండడంతో పార్టీ కేడర్‌కు ఆయనకు మధ్య గ్యాప్ పెరిగింది. ఈ పరిణామాలు అన్ని ఆలపాటిపై తెనాలి నియోజకవర్గంలో వ్యతిరేకత పెరుగుతోందని అంటున్నారు పరిశీలకులు. వాస్తవానికి పార్టీపై సానుభూతి ఉన్నప్పటికీ.. వ్యక్తిగా ఆలపాటి రాజేంద్రప్రసాద్‌పై మాత్రం వ్యతిరేకత పెరుగుతుండడం గమనార్హం. ఆయన ఇప్పటికైనా ఆయన క్షేత్రస్థాయిలో పార్టీని పట్టించుకుని, నాయకుల సమస్యలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకపోతే తెనాలిలో వచ్చే ఎన్నికల్లోనూ ఆయనకు ఎదురీత తప్పదనే అంటున్నారు.

## యరపతినేని దారెటు...



గుంటూరు, మే 24, (న్యూస్ పల్స్)టీడీపీ సీనియర్ నాయకుడు, గుంటూరు జిల్లా గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు రాజకీయంగా సైలెంట్‌గా ఉండటం జిల్లా టీడీపీ వర్గాల్లోనే కాకుండా రాష్ట్ర పార్టీలోనూ చర్చనీయాంశంగా మారింది. గురజాల నియోజకవర్గంలో వరుస విజయాలు దక్కించుకుని మంచి గుర్తింపు పొందిన నేత.. యరపతినేని శ్రీనివాసరావు చంద్రబాబు, లోకేష్‌కు అత్యంత ఆప్తుడు. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఆయన జిల్లాలో ఓ రేంజ్‌లో చక్రం తిప్పారు. ఈయన ప్రారంభించిన కళ్యాణ కానుక పథకం ఆలంబనగా.. చంద్రబాబు మహిళలకు పసుపు-కుంకుమ వంటి పథకాలు అమలు చేశారు. 1994, 2009, 2014లో టీడీపీ తరఫున ఇక్కడ విజయం దక్కించుకున్న యరపతినేని శ్రీనివాసరావు గత ఎన్నికల్లో ఓడిపోయారు. గడిచిన రెండేళ్లలో తొలి ఏడాది బాగానే యాక్టివ్‌గా పనిచేసినా.. ఆరేడు మాసాలుగా ఆయన ఎవరికీ అంతుచిక్కడం లేదు. నియోజకవర్గంలోనూ యాక్టివ్ పాలిటిక్స్ చేయడం లేదు. పైగా పార్టీలోనూ గతంలో ఉన్నంత జోరు చూపించలేక పోతున్నారు. ఈ పరిణామాలతో అసలు యరపతినేని శ్రీనివాసరావు టీడీపీలో ఉండేనా ? వచ్చే ఎన్నికల బరిలో ఉంటారా ? అన్నది కూడా పార్టీలో కాస్త సందేహంగా వినిపిస్తోన్న మాట. స్థానిక ఎన్నికల్లోనూ ఆయన ఇల్లు విడిచి బయటకు రాలేదు. ఇక, రాజకీయంగా మీడియా ముందుకు కూడా రావడం లేదు. దీనికి ప్రధానంగా తనపై ఉన్న మైనింగ్ కేసులేనని కొందరు అంటున్నారు. ఏడాది క్రితం యరపతినేని శ్రీనివాసరావు అక్రమ మైనింగ్ కేసు ఏకంగా సీబీఐ వరకు వెళ్లింది. తర్వాత ఏం జరిగిందో కాని? ఈ కేసు ఒక్కసారిగా తెరమరుగు అయ్యింది. యరపతినేని సైలెంట్ అయిపోయారు. ఇది ఓ సందేహం అయితే మరికొందరు.. పార్టీలో ఆయనకు నిరాదరణ పెరిగిందని చెబుతున్నారు. జగన్ సర్కారు యరపతినేని శ్రీనివాసరావు పై పెట్టిన కేసులను అరెస్టు వరకు తెచ్చుకోకుండా.. ఆయనే సర్దు బాటు చేసుకున్నారు. కానీ, పార్టీపరంగా తనకు ఎలాంటి లబ్ధి చేకూరడం లేదని.. కనీసం పలకరింపు కూడా లేదని యరపతినేని శ్రీనివాసరావు అనుచరులు అంటున్నారు. దీనికితోడు తాను ఇప్పుడు దూకుడుగా ఉన్నా.. ప్రయోజనం లేదని.. ఓ నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది. అసలు ఎంపీటీసీ, జడ్పీటీసీ, పిడుగురాళ్ల మున్సిపల్ ఎన్నికలను ఆయన ఏ మాత్రం పట్టించుకోకపోవడంతో గురజాల వైసీపీ ఏకగ్రీవాలతో స్వీప్ చేసి పడేసింది. నియోజకవర్గంలో వైసీపీ హవానే ఎక్కువగా ఉందని.. తాను ఒంటరి పోరు చేయడం వల్ల కేసులు పెరిగే అవకాశం ఉందని యరపతినేని శ్రీనివాసరావు తలపోస్తున్నట్టు చెబుతున్నారు. ఈ కారణంగానే యరపతినేని శ్రీనివాసరావు మౌనంగా ఉన్నారని అంటున్నారు. ఇక, పార్టీ మారే విషయానికి వస్తే.. సంస్థాగతంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ.. ఆయన ఏనాడూ పార్టీ మారిన పరిస్థితి లేదు కనుక.. ఇప్పుడు కూడా టీడీపీలోనే కొనసాగుతారని, కానీ, మరో రెండేళ్లు మాత్రం మౌనంగానే ఉండనున్నారని చెబుతున్నారు

## 35 మందికి ఈ సారి కష్టమేనా

ఏలూరు, మే 24, (న్యూస్ పల్స్)వైసీపీ అధినేత, సీఎం జగన్ వ్యూహం.. చాలా లోతుగా, స్ట్రాంగ్‌గా ఉందని అంటున్నారు రాజకీయ పరిశీలకులు. వచ్చే ఎన్నికలు.. అంత సజావుగా ఉండవని.. పోరు చాలా తీవ్రంగా ఉంటుందని ముందుగానే రాజకీయ నేతలు అంచనా వేసుకుంటున్నారు. ఇప్పటికే ఓ సారి ఓడి ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ మరోసారి ఓడేందుకు సిద్ధంగా ఉండదు. ఏపీలో ప్రస్తుత రాజకీయ సంక్షోభాన్ని క్యాష్ చేసుకునేందుకు బీజేపీ కూడా కాచుకునే ఉంది. ఈక్రమంలో ఎవరికి వారు.. వ్యూహాత్మకంగా ముందుకు సాగేందుకు రెడీ అవుతున్నా రు. ముఖ్యమంత్రి జగన్‌ను కట్టడి చేసేందుకు లేదా.. జగన్ సర్కారును కూల్చేసేందుకు.. మహాకూటమి ఏర్పడినా పెద్దగా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు. ఈ నేపథ్యంలో అప్పటికి ఆయా పరిస్థితులను ఎదిరించి నిలబడేందుకు జగన్ ఇప్పటినుంచే సన్నద్ధం అవుతున్నారు. ఈ క్రమంలో తన ఇమేజ్‌ను మరింత బిల్డప్ చేసుకునేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. అదే సమయంలో ఎమ్మెల్యేలు అవినీతి, అక్రమాలకు పాల్పడకుండా.. చూడడంతోపాటు ప్రజలకు వారు మరింత చేరువ అయ్యేలా కూడా వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. ఈక్రమంలో ఆయన ఎవరికీ ఎలాంటి టార్గెట్లు పెట్టడం లేదు. రేపు ఈ కార్యక్రమం ఉంది.. ఎల్లుండి ఆ కార్యక్రమం ఉంది.. కాబట్టి.. దీనికి ఇంత ఇవ్వాలి అనే సంస్కృతి వైసీపీలో కనిపించడం లేదు. అంటే.. దీనిని బట్టి.. ఎమ్మెల్యేలను నీతివంతులుగా ప్రొజెక్టు చేయాలని జగన్ తాపత్రయ పడుతున్నాడనేది స్పష్టమవుతోంది. దీనికి ప్రధాన కారణం.. వచ్చే ఎన్నికల్లో ఎంతటి బలమైన శక్తులనైనా.. ఎదిరించి నిలబడాలనేది జగన్ వ్యూహం. అయితే.. క్షేత్రస్థాయిలో మాత్రం? నాయకులు మారడం లేదు. ఇప్పటికీ.. జగన్ నుంచి ఎన్నిహెచ్చరికలు వచ్చినా.. పోలీసులు ఎంతగా అప్రమత్తం అయినా.. కూడా ఇసుక, మట్టి వంటి వ్యాపారాల్లో అధికార పార్టీ ఎమ్మెల్యేల హస్తం ఉందని వినిపిస్తోంది. ఈ క్రమంలోనే ఇలాంటి వారిపై నిఘా పెట్టారు.. జగన్.ప్రతి ఆరు మాసాలకు ఒకసారి.. జగన్ నివేదికలు తెప్పించుకుని.. ఆయా నివేదికల ఆధారంగా.. ఎమ్మెల్యేలపై ఒక అంచనాకు వస్తున్నారని అంటున్నారు. ఇలాంటి వారిలో 30-35 మంది తమ పద్ధతి మార్చుకో లేదని.. జగన్ ఒక నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. కొందరు ఎమ్మెల్యేలకు జిల్లా పార్టీ ఇన్‌చార్జ్‌లతో వార్నింగ్‌లు ఇప్పించినా వారి తీరు మారలేదు. మరి కొందరు ఎమ్మెల్యేలు ఇటీవల స్థానిక సంస్థల ఎన్నికల్లో పదవులు అన్నీ తమ అనుచరులకే కట్టబెట్టుకునే ప్రయత్నం చేసినా కూడా అధిష్టానం నేరుగా వాళ్లకు చెక్ పెట్టి స్థానిక, సామాజిక , ప్రాంతీయ ఈక్వేషన్లతో పదవులు ఇచ్చింది. ఏదేమైనా నియోజకవర్గంలో సామంత రాజులుగా వ్యవహరిస్తోన్న వారికి మరోసారి ఛాన్స్ ఇచ్చి.. హెచ్చరించి.. అప్పటికీ మారకపోతే.. పూర్తిగా పక్కన పెట్టాలని నిర్ణయానికి వచ్చినట్టు వైసీపీలో చర్చ జరుగుతుండడం గమనార్హం. మరి వారెవరు..? ఇప్పటికైనా మారతారా లేదా ? అనే విషయాలను పరిశీలించాల్సిన అవసరం ఉంది.

## నిమ్మలకు లోకల్ భారం

ఏలూరు, మే 24, (న్యూస్ పల్స్)ఆయన టీడీపీ ఎమ్మెల్యే. పార్టీ ఇంతకష్టకాలంలో ఉన్నా కూడా తిరుగులేని దూకుడు చూపిస్తున్నారు. అసెంబ్లీలోను, ఇతర వేదికలపైనా.. ఆయన దూకుడుగా విమర్శలు చేస్తున్నారు. పార్టీ తరఫున గట్టి వాయిస్ కూడా వినిపిస్తున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. నియోజకవర్గంలో పరిస్థితి మాత్రం ఆయనకు కలిసి రావడం లేదని అంటున్నారు పరిశీలకులు. ఆయనే పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు. పాలకొల్లు నియోజకవర్గం.. వాస్తవానికి టీడీపీకి కంచుకోట. టీడీపీ ఆవిర్భవించిన తర్వాత.. 1983 నుంచి ఇప్పటి వరకు కూడా 1989, 2009 ఎన్నికల్లో తప్ప.. మిగిలిన అన్ని ఎన్నికల్లోనూ రాష్ట్రంలో ఎలాంటి రాజకీయ పరిణామాలు చోటు చేసుకున్నా.. టీడీపీ విజయం దక్కించుకుంటూనే ఉంది. సో.. అలానే 2014, 2019లో ఇక్కడ నుంచి నిమ్మల రామానాయుడు గెలుపు గుర్రం ఎక్కారు. 2014లో కంటే.. 2019 ఎన్నికల్లో ఆయన గెలుపు గుర్రం ఎక్కడం నిజంగా గ్రేట్. ఎందుకంటే. రాష్ట్ర వ్యాప్తంగా జగన్ సునామీ, వైసీపీ పవనాలు జోరుగా సాగినందున.. హేమాహేమీలు కూడా ఓడిపోయిన నేపథ్యంలో నిమ్మల రామానాయుడు విజయం ఖచ్చితంగా రికార్డే..! ఇంత వ్యతిరేక గాలిలో కూడా నిమ్మల ఏకంగా 18 వేల ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. అయితే.. ఈ విషయంలో స్థానిక టీడీపీ నేతలు మాత్రం.. భిన్నంగా ఉన్నారు. టీడీపీ కంచుకోట కాబట్టి విజయం సాధించారు.. ఆయన గొప్పేం లేదు! అనే మాట వినిపిస్తోంది. ఇక, నియోజకవర్గంలో ఎన్నికలకు ముందున్న పరిస్థితి ఇప్పుడు కనిపించడం లేదు. నిమ్మల రామానాయుడు వెంట నడిచేందుకు కేడర్ కూడా పెద్దగా ముందుకు రావడం లేదు. దీంతో కొన్ని రోజులు ఒంటరిగానే ఓ పది మందితో పార్టీ తరఫున కార్యక్రమాలు ముగించిన నిమ్మల రామానాయుడు తర్వాత తర్వాత.. నియోజకవర్గంలో అయిష్టంగానే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అయితే.. రాష్ట్ర స్థాయిలో మాత్రం.. ఖచ్చితంగా ఆయన దూకుడు చూపిస్తున్నారు. ఇటీవల జరిగిన తిరుపతి ఉప ఎన్నికలోనూ.. ఇతరత్రా విషయాల్లోనూ ప్రభుత్వాన్ని టార్గెట్ చేసుకుని వ్యాఖ్యలు చేస్తున్నారు. అదే సమయంలో అసెంబ్లీలోనూ అనేక మార్లు సస్పెండ్ కావడం.. సీఎం జగన్‌పై విమర్శలు చేయడం వంటివి నిమ్మల రామానాయుడును బాగానే ప్రొజెక్టు చేశాయి. అయితే.. నియోజకవర్గంలో మాత్రం ఏ చిన్న కార్యక్రమం నిర్వహించినా నాయకుల కోసం వెయిట్ చేసే పరిస్థితి వస్తోంది. అంటే.. ఆయన పనులు చేయించడం లేదని బాధో.. లేక మరేదైనానో తెలియదుకానీ.. నేతలు మాత్రం సహకరించడం లేదనేది వాస్తవం. ఇక జగన్ రామానాయుడిని బాగా కాన్‌సంట్రేషన్ చేస్తున్నారు. కీలక పదవులు అన్ని పాలకొల్లు నేతలకే కట్టబెడుతున్నారు. ప్రతిష్టాత్మకమైన డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్ పదవులు పాలకొల్లుకే ఇచ్చిన జగన్ రేపో మాపో పశ్చిమ జడ్పీచైర్మన్ పదవి కూడా ఇదే నియోజకవర్గ ఇన్‌చార్జ్ కవురు శ్రీనివాస్‌కు ఇస్తున్నారు.

## అసంతృప్తి ఉన్నా... సైలెంటే...

కాకినాడ, మే 24, (న్యూస్ పల్స్)ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 151 నియోజకవర్గాల్లో విజయం సాధించింది. ఇది వైసీపీకి ఊహించని విజయమే. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చి రెండేళ్లవుతున్నా జిల్లాలో నేతలు మాత్రం మౌనంగానే ఉంటున్నారు. ఎన్నికలకు ముందు దూకుడు ప్రదర్శించిన వైసీపీ నేతలు రెండేళ్ల నుంచి మౌనంగానే ఉంటున్నారు. పదమూడు జిల్లాల్లో ఏ ఒక్క నేత నోరు విప్పడం లేదు. టీడీపీ చేసే ఆరోపణలపైనా పెద్దగా స్పందన లేదు. స్థానిక సంస్థల ఎన్నికలు, తిరుపతి ఉప ఎన్నిక ముగిసిపోయింది. ఇక ఇప్పట్లో ఎన్నికలు లేవు. ప్రతిపక్ష నేత చంద్రబాబు మాత్రం వైఎస్ జగన్ ను టార్గెట్ చేసుకున్నారు. ప్రతి విషయంలో జగన్ పై విమర్శలు చేస్తున్నారు. ప్రధానంగా కర్నూలులో ఎన్ 440 కే వేరియంట్ వ్యాప్తి చెందిందని, ఇది ప్రమాదకరమని చంద్రబాబు పదే పదే విమర్శించారు. కానీ కర్నూలు జిల్లా నుంచి ఏ ఒక్క వైసీపీ నేత కూడా దీనిపై స్పందించలేదు. తమ కర్నూలు ప్రాంతంపై చంద్రబాబు ఆరోపణలు చేసినా ఆ ప్రాంత నేతలు ఎందుకు స్పందించలేదన్నది ఇప్పుడు పార్టీలో చర్చనీయాంశమైంది. నిజానికి కర్నూలులో గత ఎన్నికలలో వైసీపీ క్లీన్ స్వీప్ చేసింది. అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు రెండు పార్లమెంటు స్థానాలను కైవసం చేసుకుంది. ఇక్కడ ఇద్దరు మంత్రులు ఉన్నారు. సీనియర్ నేతలున్నారు. కానీ కర్నూలు పై చంద్రబాబు ఆరోపణలు చేసినా నేతలు మాత్రం మౌనంగానే ఉండటం సందేహాలకు తావిస్తుంది. మరికొద్ది నెలల్లో మంత్రి వర్గ విస్తరణ ఉండటంతోనే వైసీపీ నేతలు మౌనంగా ఉన్నారా? అన్న అనుమానమూ వ్యక్తమవుతుంది. చంద్రబాబు పై విమర్శలు చేయడం వల్ల వచ్చే నష్టంలేకపోయినా వైసీపీ నేతలు స్పందించకపోవడానికి వేరే కారణాలున్నాయంటున్నారు. ఇక్కడ నియోజకవర్గాల్లో రెండు గ్రూపులు ఉన్నా అధిష్టానం పట్టించుకోవడం ఒక కారణమయితే, స్థానిక సంస్థల ఎన్నికల్లో తమమాట చెల్లుబాటు కాకపోవడం కూడా వారి మౌనానికి కారణమనే చెబుతున్నారు. మొత్తం మీద కర్నూలు వైసీపీ నేతలు నోరు మెదపకపోవడానికి అనేక కారణాలున్నాయంటున్నారు.

## రెండేళ్ల తర్వాత కోలుకోలేదే

విజయవాడ, మే 24, (న్యూస్ పల్స్)తెలుగుదేశం పార్టీ రెండేళ్ల తర్వాత కూడా ఓటమి నుంచి కోలుకోలేదు. చంద్రబాబు ఎంత ప్రయత్నిస్తున్నా ఫలితం కన్పించడం లేదు. తిరుపతి ఉప ఎన్నిక ఫలితం తర్వాత నేతలు మరింత డీలా పడ్డారు. ఇప్పుడిప్పుడే ఎన్నికలు లేకపోయినా కరోనా సమయంలో ప్రజలకు అండగా నిలవాలని పార్టీ అధినేత చంద్రబాబు ఇచ్చిన పిలుపును కూడా నేతలు పట్టించుకోవడంలేదు. జిల్లాకు ఒకిరద్దరు మినహా నేతలు స్పందించడం లేదు. కరోనా వ్యాక్సినేషన్ విషయంలో వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు తెలియజేయాలని చంద్రబాబు పిలుపునిచ్చినా ఏమాత్రం స్పందన కన్పించలేదు. తెలుగుదేశం పార్టీ నేతలు ఇప్పటికే ఆర్థికంగా చితికిపోయారు. మండల స్థాయి నేతల నుంచి నియోజకవర్గ స్థాయి నేతల వరకూ ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నారు. కొందరికి పెండింగ్ బిల్లులు రాకపోవడంతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఇష్టపడటం లేదు. వచ్చే ఎన్నికల్లో పోటీ చేయాలంటే తాము ఆర్థికంగా నిలదొక్కుకోవాలని ఎక్కువ మంది నేతలు వ్యాపారాలపైనే దృష్టి పెట్టారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నైల్లో ఉండే తమ వ్యాపారాలను వారే స్వయంగా చూసుకుంటున్నారు. నియోజకవర్గాలకు దూరంగా ఉంటున్నారు. దీంతో పార్టీ కేంద్ర నాయకత్వానికి అందిన నివేదిక ప్రకారం దాదాపు 90 నియోజకవర్గాల్లో నేతలు పార్టీకి దూరంగా ఉంటున్నారన్న నివేదిక పార్టీ అధినాయకత్వాన్ని ఆశ్చర్యానికి గురి చేసింది. కరోనాను చూపుతూ?అయితే దీనికి కరోనా ను కారణంగా చూపుతున్నారు. కరోనా కారణంగానే తాము బయటకు రాలేకపోతున్నామని కొందరు నేతలు పార్టీ నాయకత్వానికి వివరణ ఇచ్చుకున్నట్లు సమాచారం. చంద్రబాబు సయితం హైదరాబాద్ లోనే ఉండి పార్టీ కార్యక్రమాలను పర్యవేక్షిస్తుండటంతో మిగిలిన నేతలకు అది అలుసుగా మారిందంటున్నారు. మొత్తం మీద తిరుపతి ఉప ఎన్నిక తర్వాత పార్టీలో జోష్ నెలకొంటుందన్న చంద్రబాబు అంచనాలు తలకిందులయ్యాయి.

## సామాన్యులకు పెద్ద పీట

తిరుపతి, మే 24, (న్యూస్ పల్స్)గన్ కు పార్టీలో ప్రాణం ఇచ్చేవారు అనేక మంది ఉన్నారు. జగన్ ఎదుటి వ్యక్తుల నుంచి పైసా ఆశించకుండా అందలం ఎక్కించిన సందర్భాలు ఉన్నాయి. ఇప్పుడు తిరుపతి ఎంపీ గురుమూర్తి కూడా అంతే. వైద్యుడిగా ఉన్న గురుమూర్తిని ఎంపీ అభ్యర్థిగా ఎంపిక చేయడమే అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. జగన్ కేవలం తిరుపతి ఉప ఎన్నికల్లోనే కాదు సాధారణ ఎన్నికల్లో కూడా అతి సామాన్యులకు అతిపెద్ద పదవిని కట్టబెట్టారు. ముందుగా బాపట్ల పార్లమెంటు సభ్యుడు నందిగం సురేష్ ను తీసుకుంటే ఆయన ఒక సామాన్య వ్యక్తి. పార్టీ కోసం పనిచేసే సాధారణ కార్యకర్త. అమరావతి ప్రాంతంలో తోటలు దగ్ధమయిన కేసులో నందిగం సురేష్ పై అప్పటి ప్రభుత్వం కేసు నమోదు చేసింది. దీంతో సురేష్ లో ఉన్న ఫైర్ ను జగన్ గమనించారు. వెంటనే సాధారణ ఎన్నికల్లో బాపట్ల పార్లమెంటు సభ్యుడిగా ఎంపిక చేశారు. అక్కడ గెలవడంతో ఏకంగా ఆయన పార్లమెంటు గడప ఎక్కారు. జగన్ మీద ఈగ వాలినా నందిగం సురేష్ ఒప్పుకోరు. ఇక అరకు పార్లమెంటు సభ్యురాలు గొడ్డేటి మాధవి. ఓ ప్రభుత్వ పాఠశాలలో కాంట్రాక్ట్ టీచర్. మాధవి తండ్రి గొడ్డేటి దేముడు సీపీఐ నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. గిరిజనుల్లో మంచి పేరున్న ఆ కుటుంబానికి ఏకంగా పార్లమెంటు సభ్యత్వ పదవిని ఇచ్చారు. పైసా ఖర్చు పెట్టకుండా పార్లమెంటు మెంబర్ అయ్యారు. రాజకీయాలంటే ఇష్టం లేకపోయినప్పటికీ జగన్ పై నమ్మకంతో వచ్చిన ఆమె ఇప్పుడు కీలక పదవి పొందారు. తిరుపతి ఉప ఎన్నికల్లో పోటీ చేసిన గురుమూర్తి సయితం సాధారణ వైద్యుడే. దళిత కుటుంబంలో జన్మించి అంచెలంచెలుగా ఎదిగి ఫిజియోథెరపిస్ట్ గా మారారు. జగన్ పాదయాత్ర సమయంలో ఆయన వెన్నంటి ఉండి సేవలందించారు. ఇప్పుడు గురుమూర్తి కూడా సాధారణ స్థాయి నుంచి పార్లమెంటు కు ఎంపికయ్యారు. ఇలా జగన్ సెలక్షన్ డిఫరెంట్ గా ఉంటుందని, నాయకత్వంపై నమ్మకం పెంచుకోవడానికి ఇలాంటి ఎంపికలు ఉపయోగ పడతాయి.

## సింహాచలంలో ధన్వంతరి హోమం

విశాఖపట్నం కరోనా మహమ్మారి నుంచి మానవా ళిని రక్షించేందుకు.. ప్రజారోగ్యం కోసం లోకకల్యాణం కోసం విశాఖ సింహాచలం పుణ్యక్షేత్రంలో ధన్వంతరి, సుదర్శన హోమాలు ఘనంగా నిర్వహించారు. ఆలయంలో వేదపండి తుల సమక్షంలో చేపట్టారు. కరోనా విజృంభణతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున.. లోక కల్యాణం, ప్రజారోగ్యం కోసం ధన్వంతరి, సుదర్శన హోమాలు నిర్వహించాలని సింహాచలం శ్రీవరాహలక్ష్మీనృసింహస్వామి ఆలయ ధర్మకర్త సంచయిత గజపతి, ఈవో సూర్యకళ, అధికారులు నిర్ణయించారు. ఆలయంలో హోమం నిత్య కల్యాణం, స్వాతి నక్షత్ర హోమం కూడా నిర్వహించామని ఆలయ అధికారులు తెలిపారు.

## భవిష్యత్తుపై ఆలోచనలో కిడారి

విశాఖపట్టణం, మే 24, (న్యూస్ పల్స్)ఆయన అనూహ్యంగా రాజకీయాల్లోకి వచ్చారు. అది కూడా గ్రూప్ వన్ పరీక్షలు రాసి ఉన్నత ఉద్యోగం చేయాలనుకుంటున్న క్రమంలో తండ్రి కిడారి సర్వేశ్వరరావు దారుణ హత్యతో ఈ వైపుగా నెట్టబడ్డారు. 2018లో అరకు ఎమ్మెల్యే కిడారిని మావోయిస్టులు హతమార్చిన సంగతి విదితమే. ఆ వెంటనే చంద్రబాబు సింపతీ కార్డు బయటకు తీశారు. దాని ఫలితంగా కిడారు పెద్ద కుమారుడు కిడారి శ్రావణ్ కుమార్ ఒక్కసారిగా మంత్రి అయిపోయారు. ఆరు నెలల పాటు ఆ పదవిని అనుభవించిన ఆయన ఎమ్మెల్యే కాకుండాగే గద్దె దిగాల్సి వచ్చింది. ఇక చంద్రబాబు 2019 ఎన్నికల్లో కిడారి శ్రావణ్ కుమార్ కి అరకు నుంచి టీడీపీ టికెట్ ఇచ్చారు. కానీ అప్పటికే అక్కడ బాగా పాతుకుపోయిన వైసీపీ నేత చెట్టి ఫల్గుణ చేతిలో భారీ తేడాతో ఓడిపోయారు. ఆ తరువాత ఆయన రాజకీయాల ముఖం అసలు చూడరు అని కూడా అంతా భావించారు. దానికి తగినట్లుగా కొన్నాళ్ళు మౌనంగా ఉన్న కిడారి శ్రావణ్ కుమార్ ఈ మధ్య కాలంలో మళ్ళీ జోరు పెంచారు. విశాఖలోనే నివాసం ఉంటున్నా అక్కడ నుంచి అరకు తరచూ వెళ్తూ టీడీపీ ఉనికి చాటే ప్రయత్నం చేస్తున్నారు. అయితే అరకులో టీడీపీ ఎదుగుదల అన్నది ఇప్పటికైతే కత్తి మీద సామే అంటున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో వైసీపీకి గట్టి పట్టుంది. పైగా అరకు నుంచి తాజా ఎన్నికల్లో గెలిచిన చెట్టి ఫల్గుణ కూడా కష్టపడే నైజం కలిగిన నేత. ఆయన పూర్వాశ్రమంలో బ్యాంక్ ఎంప్లాయ్. దాంతో ప్రజలతో ఆయన కలసిపోతున్నారు. ఇక గిరిజనులు వైసీపీ పట్ల ఆకర్షితులై ఉన్నారు. ఎన్నికలు ఎపుడు జరిగినా అభ్యర్ధి ఎవరు అన్నది చూడకుండానే వైసీపీకి ఓటేసే నైజం గిరిజనానిది. ఇలా ఏకపక్షంగా సాగుతున్న మన్యం రాజకీయాన్ని కీలక మలుపు తిప్పడం కొత్తగా రాజకీయాల్లోకి వచ్చిన కిడారి శ్రావణ్ కుమార్ కి కష్టమే అని చెప్పాలి. కిడారి శ్రావణ్ కుమార్ మొదట్లో ఇష్టం లేకుండా రాజకీయాల్లోకి వచ్చారని ప్రచారం జరిగింది కానీ ఇపుడు మాత్రం ఆయన పూర్తి రాజకీయ అవతారం ఎత్తేయాలనుకుంటున్నారుట. యువకుడిగా ఉన్న కిడారి శ్రావణ్ కుమార్ తనకు ఇదే సరైన మార్గం అనుకుంటున్నారుట. ఇప్పటి నుంచి కష్టపడితే ఏదో రోజున తాను ఎమ్మెల్యే అవుతాను అని కూడా ఆయన ధీమా వ్యక్తం చేస్తున్నారు. అందుకే ఏజెన్సీలో టీడీపీ విత్తనాలు వేసినా మొలవవు అని తెలిసినా కూడా ఆయన భగీరథ ప్రయత్నమే చేస్తున్నారు. ఏదో రోజున ఏడారిలోనూ పసుపు మొక్కలు మొలుస్తాయని గట్టి నమ్మకంతో ఉన్నారు. ఇక్కడ మరోటి కూడా చెప్పుకోవాలి. సీనియర్ నాయకులు అంతా టీడీపీని పట్టించుకోకపోయినా కిడారి శ్రావణ్ కుమార్ లాంటి వారు పార్టీ కోసం ముందుకు రావడంతో హై కమాండ్ కూడా ఆయనను ప్రోత్సహిస్తోందిట. మరి వైసీపీ మీద విరక్తి కలుగుతుందో కిడారి మీద అనురక్తి పుడుతుందో కానీ ఏదైనా అద్భుతం జరిగితే అరకు సైకిలెక్కినా ఎక్కవచ్చేమో.

## గ్రామ స్థాయిలో కోవిడ్ పరీక్షలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం

### మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్

విశాఖపట్నం విశాఖ ఏజెన్సీలో గ్రామస్థాయిలో పూర్తిస్థాయిలో కోవిడ్ పరీక్షలు చేయడంలో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ను మాజీ మంత్రికి శ్రావణ్ కుమార్ విశాఖలో కలిసి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో కోవిడ్ పరీక్షలు చేయడంలో గాని ఈ స్థాయిలో వైద్యం అందించడంలో వైసీపీ ప్రభుత్వం విఫలమైందని రోజు రోజుకి రోగులు పెరిగిపోతున్న అని ఆక్సిజన్ ఇవ్వలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉందని విశాఖ ఏజెన్సీలో అపడమిక్ సీజన్ కావడంతో సీజనల్ వ్యాధులు టైఫాయిడ్ మలేరియా డెంగ్యూ అంటి వ్యాధులు వస్తున్న నేపథ్యంలో కరోన భయంతో ప్రజలందరూ విలవిలలాడిపోతూ ఉన్నారని రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు భరోసా ఇవ్వలేని దుస్థితిలో ఉందని ప్రజా ఆరోగ్యాన్ని గాలికొదిలి ఏసీ రూముల్లో కూర్చుని ఇష్టా రాజ్యపరిపాలన ఈ రాష్ట్రంలో జరుగుతుందని గిరిజన ప్రాంతంలో పౌష్టిక ఆహారం దొరకక గిరిజనులు అనేక ఇబ్బందులకు గురి అవుతుంటే తూతూమంత్రంగా ఉచిత సరుకులు ఇస్తామని ఒక్క బియ్యం ఇచ్చి చేతులు దులుపుకుంది వైసిపి ప్రభుత్వం.ప్రభుత్వంఏర్పాటు అయినప్పటి నుంచి గిరిజన ప్రాంత అభివృద్ధి లేదు సరికదా ప్రజారోగ్యాన్ని కూడా గాలికొదిలి పరిపాలిస్తుంది అని గ్రామస్థాయిలో మారుమూల ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి పరీక్షలు చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చే విధంగా తెలుగుదేశం పార్టీ నిర్ణయం తీసుకోవాలని విశాఖపట్నం లో నారా లోకేశ్ కి కలసి మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

## మే 25న మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ 291వ జయంతి

తిరుమల,మే 24 శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి అపరభక్తురాలు, భక్తకవయిత్రి మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ 291వ జయంతి ఉత్సవం మే 25న తిరుమలలో జరుగనుంది. కోవిడ్–19 వ్యాప్తి నేపథ్యంలో ఈ ఉత్సవాలను తిరుమల శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో, తిరుమల వెంగమాంబ బృందావనంలో, తిరుపతి అన్నమాచార్య కళామందిరంలో ఏకాంతంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా తిరుమలలోని వెంగమాంబ బృందావనంలో ఉదయం 9 నుండి 10 గంటల మధ్య ఏకాంతంగా పుష్పాంజలి సమర్పిస్తారు. సాయంత్రం 5.30 గంటల నుండి ఉభయనాంచారులతో కూడిన శ్రీమలయప్ప స్వామివారిని ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగింపు చేపడతారు. అనంతరం ఆలయంలోని రంగనాయకుల మండపంలో ఏకాంతంగా వెంగమాంబ జయంతి కార్యక్రమం నిర్వహిస్తారు. శ్రీవారిపై అచంచలమైన భక్తివిశ్వాసాలు ప్రదర్శించిన వెంగమాంబ 1730వ సంవత్సరంలో జన్మించారు. శ్రీ రాఘవేంద్రస్వామి, శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి వారి లాగా తన బృందావనంలోనే 1817వ సంవత్సరంలో సజీవ సమాధి చెందారు. తిరుమలలో అన్నదానాన్ని ప్రారంభించినందుకు గుర్తుగా వెంగమాంబ పేరు ముందు మాతృశ్రీ అనే పదం చేరింది.

## సూర్యప్రభ వాహనంపై గోవిందరాజస్వామి కటాక్షం

తిరుపతి మే 24 తిరుపతిలోని శ్రీ గోవిందరాజస్వామివారి బ్రహ్మోత్సవాల్లో ఏడో రోజైన సోమవారం ఉదయం గోవిందరాజస్వామివారు సూర్యప్రభ వాహనంపై కటాక్షించారు. కోవిడ్ – 19 వ్యాప్తి నేపథ్యంలో ఆలయంలో ఏకాంతంగా వాహన సేవ నిర్వహించారు.సూర్యుడు తేజోనిధి, సకలరోగ నివారకుడు, ప్రకృతికి చైతన్యప్రధాత. వర్షాలు, వాటివల్ల పెరిగే వృక్షలు, చంద్రుడు, అతని వల్ల పెరిగే ఔషధాలు మొదలైనవన్నీ సూర్యతేజం వల్లనే వెలుగొందుతున్నాయి. అట్టి సూర్యప్రభను అధిష్టించిన స్వామిని దర్శించడం వలన ఆయురారోగ్యాలు సిద్ధిస్తాయి.అనంతరం ఉదయం 9.30 నుండి 10.30 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామివారికి స్నపనతిరుమంజనం నిర్వహించారు.

# పశ్చిమంలో శ్వేత ఎంట్రీకి ప్లానా...

విజయవాడ, మే 24, (న్యూస్ పల్స్)రాజకీయాల్లోకి రావడం అంటే.. పదవులు దక్కించుకోవడం.. అధికారం చలాయించడం కోసమే అనడంలో ఎలాంటి సందేహం లేదు. నేతలు ఎవరైనా.. ఎలాంటి వారైనా ఖచ్చితంగా రాజకీయాల్లోకి వచ్చాక చేతులు ముడుచుకుని మాత్రం ఎవరూ కూర్చోరు. ఇప్పుడు ఇలాంటి పరిణామమే టీడీపీలోనూ చోటు చేసుకుంది. టీడీపీ తరఫున వరుసగా పార్లమెంటుకు విజయం సాధిస్తున్న విజయవాడ నాయకుడు కేశినేని నాని.. ఇటీవల జరిగిన కార్పొరేషన్ ఎన్నికలను సవాలు తీసుకుని పోరాటం చేశారు.క్రమంలోనే విజయవాడ నగర మేయర్‌గా తన కుమార్తె శ్వేత కేశినేనిని ప్రమోట్ చేసుకునేందుకు, ఆమెను విజయవాడ మేయర్ పీఠంపై కూర్చోబెట్టేందుకు.. రేయింబవళ్లు పోరాటం చేశారు. ఇక, తన పార్టీ నేతల నుంచి ఎదురైన అసంతృప్తిని కూడా తట్టుకుని కేశినేని నాని ముందుకు సాగారు. అయితే.. ఇంత చేసినా.. ఆయన సక్సెస్ కాలేక పోయారు. శ్వేత కేశినేని కార్పొరేటర్‌గా అయితే.. గెలిచినా.. మేయర్ పీఠం దక్కించుకోలేక పోయారు. టీడీపీ పూర్తిగా చతికిల పడడంతో శ్వేత కు అవకాశం దక్కకుండా పోయింది.రాజకీయాల్లోకి ఎలాగూ వేలు పెట్టిన తర్వాత.. ఒక ఛాన్స్ మిస్సయితే.. మరొకటి దొరకకపోతుందా? అనే ఆశావహ దృక్పథంతో ఇప్పుడు ఏకంగా ఆమె.. ఎమ్మెల్యే పీఠంపై దృష్టి పెట్టారు. వచ్చే ఎన్నికల్లో విజయవాడ పశ్చిమ నియోజకవర్గం నుంచి పోటీ చేసే అవకాశంపై ఆమె ఇప్పటి నుంచి దృష్టి పెట్టినట్టు సమాచారం. ప్రస్తుతం కరోనా నేపథ్యంలో మధ్యాహ్నం నుంచి లాక్‌డౌన్(కర్ఫ్యూ) అమల్లో ఉన్నందున.. కేశినేని నాని కుమార్తె శ్వేత.. ఇక్కడ పేద వారికి ఆహారం ఇతరత్రా నిత్యవసరాలను పంచుతున్నారు. ఇదే సమయంలో పార్టీ నేతలకు కూడా చేరువ అవుతున్నారు.కేశినేని నాని పార్టీ అధికారంలో ఉన్నప్పటి నుంచే పశ్చిమ నియోజకవర్గంపైనే ప్రధానంగా దృష్టి పెట్టారు. ఈ క్రమంలోనే ఆయన పార్టీ నేతలు బుద్ధా వెంకన్న, షేక్ నాగుల్ మీరాతో గ్యాప్ పెంచుకున్నారు. ఇక గత కార్పొరేషన్ ఎన్నికల వేళ కూడా పశ్చిమ నియోజకవర్గం కేంద్రంగానే టీడీపీలో పెద్ద రచ్చ నడిచింది. పశ్చిమలో కేశినేని నాని ఎందుకు వేలు పెడుతున్నారనే బుద్ధా, నాగుల్ మీరా రెచ్చిపోయారు. అయితే నాని మాత్రం పశ్చిమ నియోజకవర్గంపై గత ఆరేడేళ్లుగా పట్టు పెంచుకోవడానికి కారణం ఏంటన్నది పెద్దగా అంతుపట్టలేదు. దీని వెనక తన కుమార్తెను

అక్కడ పోటీ చేయించే స్కెచ్ ఉందని ఇప్పుడు అర్థమవుతోంది.మొన్న పశ్చిమ నియోజకవర్గ పరిధిలో కార్పొరేటర్‌గా గెలిచిన శ్వేత ఆ నియోజకవర్గంలో దూసుకుపోతున్నారు. ఇక్కడ ప్రస్తుతం టీడీపీని నిలబెట్టే నాయకుడు అంటూ ఎవరూ లేకపోవడం .. గత ఎన్నికల్లో టికెట్ తెచ్చుకుని పోటీ చేసి ఓడిపోయిన షబానా ఖతూన్ అమెరికాలో ఉండడం.. వచ్చే ఎన్నికల్లో ఎవరూ బలమైన అభ్యర్థి టీడీపీలో ఎదగకపోవడం వంటి ప్రధాన కారణాల నేపథ్యంలో శ్వేతకు ఇక్కడ టిక్కెట్ ఇప్పించుకోవాలని కేశినేని నాని వర్గం భావిస్తోంది. ట్రయల్‌గా భావించిన కార్పొరేటర్ ఎన్నికల్లో విజయం సాధించడం ఆమెకు కలసి వచ్చింది. అయితే ఎంపీతో పాటు నగరంలోనే తూర్పు సీటు నుంచి కమ్మ నేతలే ప్రాతినిధ్యం వహిస్తుండడంతో పశ్చిమలో బీసీ, వైశ్య, ముస్లిం వర్గాలను కాదని మళ్లీ కమ్మలకు ఛాన్స్ ఇవ్వడం అయితే కష్టమే ? మరి కేశినేని నాని స్కెచ్‌లు ఎంత వరకు నెరవేరతాయో ? చూడాలి.

# జెట్టి సినిమాలోని దూరం కరిగినా.. మౌనం కరుగునా..

### పాటను విడుదల చేసిన క్రేజీ డైరెక్టర్ వేణు ఉడుగుల..

వర్ధిన్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై వేణుమాధవ్ నిర్మాత గా సుబ్రహ్మణ్యం పిచ్చుక ను దర్శకుడిగా పరిచయం చేస్తూ నిర్మించిన మూవీ 'జెట్టి'. సౌత్ ఇండియా లో తొలి హార్బర్ బ్యాక్ డ్రాప్ లో రూపొందిన సినిమాగా తన ప్రత్యేకతను చాటుకుంది . దక్షిణ భారత దేశంలోనే ఇప్పటివరకు రాని సరికొత్త సముద్రపు కథ, నాలుగు భాషల్లో ప్రేక్షకులని అలరించనుంది. అనాదిగా వస్తున్న ఆచారాలను నమ్ముకొని జీవితం సాగిస్తున్న వీరి జీవితాలను తెరమీదకు తీసుకొచ్చాడు దర్శకుడు సుబ్రహ్మణ్యం పిచ్చుక. ఈమూవీ ఆల్బమ్ లోని మొదటి సాంగ్ ని మ్యూజిక్ డైరెక్టర్ కార్తిక్ కొండకండ్ల స్టూడియో లో లాంఛ్ చేసారు క్రేజీ డైరెక్టర్ వేణ ఉడుగుల.. సినిమా కథను తెలుసుకొని ఆయన చాలా ఉద్వేగానికి లోను అయ్యారు. ఈ సందర్భంగా వేణు ఉడుగుల మాట్లాడుతూఃజెట్టి సినిమాలోని దూరం కరిగినా పాట లాంఛ్ చేయడం చాలా ఆనందంగా ఉంది. శ్రీమణి గారు రాసిన ఈ పాట సాహిత్యపు విలువలతో ఉంది. కొన్ని షాట్స ని చూసాను చాలా బాగున్నాయి.. ప్రొడక్షన్ వాల్యూస్ కూడా బాగున్నాయి. నిర్మాత వేణు మాధవ్ గారికి, మ్యూజక్ డైరెక్టర్ కార్తిక్ కి, దర్శకుడు సుబ్రమణ్యం పిచ్చుక కు నా శుభాకాంక్షలు.. ఇది జీవితాల్లోంచి పుట్టిన కథ.. మత్సకారుల జీవితాల్లోని కన్నీటి అలలు.. సమస్యల సుడిగుండాలని విశదీకరించే అద్భుతమైన కథా వస్తువు తీసుకొని జెట్టి అనే సినిమా ని నిర్మించారు. ఇప్పుడే కథ విన్నాను..సినిమా విజయవంతం అవ్వాలని కోరుకుంటున్నాను.. అవుతుందని నమ్ముతున్నాను. నిర్మాత కి రెట్టింపు లాభాలు రావాలని ఆశిస్తున్నాను. అన్నారు. మ్యూజిక్ దర్శకుడు కార్తిక్ కొండకండ్ల మాట్లాడుతూఃమా స్టూడియోకి వచ్చి సాంగ్ ని లాంఛ్ చేసిన వేణు ఉడుగుల గారికి నా ధన్యవాదాలు. వేణు గారు తీసుకునే కథలు సందేశాత్మకంగా సాగుతాయి. జెట్టి సినిమా కథ కూడా అలాగే ఉంటుంది. ఈ సినిమాలో శ్రీమణి గారు రాసిన దూరం కరిగినా.. మౌనం కరుగునా.. పాట సిద్ శ్రీరామ్ గారు పాడారు. ఈ మెలోడీ తప్పకుండా అందరికీ నచ్చుతుందని నమ్ముతున్నాను. సినిమాలో వచ్చే మొదటి పాట ఇది. పాటల విషయంలో దర్శక నిర్మాతలు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. నాలుగు బాషల్లో విడుదలవుతున్న జెట్టి లో అన్ని పాటలు ఆకట్టుకుంటాయి. జెట్టి తప్పకుండా మంచి మ్యూజిక్ అల్బమ్ అవుతుంది. అన్నారు...దర్శకుడు సుబ్రమణ్యం పిచ్చుకు మాట్లాడుతూఃవేణు గారు మా ఆల్బమ్ లో మొదటి పాట విడుదల చేయడం చాలా సంతోషంగా ఉంది. ఇది ఇప్పటి వరకూ ఎవరూ చూపని కథ. సంగీతం విషయంలో ఎక్కడా రాజీ పడలేదు. ఆల్బమ్ అన్ని సాంగ్స్ ఆకట్టుకుంటాయి. సిద్ శ్రీరామ్ గారికి ప్రత్యేక దన్యవాదాలు. దూరం కరిగినా .. మౌనం కరుగునా పాట తో జెట్టి మ్యూజికల్ జర్నీ స్టార్ట్ అయ్యింది. సూపర్ హిట్ అల్బమ్ ని అందించబోతున్నాం అనే నమ్మకం మా టీం అందరికీ ఉంది. అన్నారు..

# కష్టాల్లో ఆటో డ్రైవర్లు



న్యూఢిల్లీ, మే 24, (న్యూస్ పల్స్)కష్టజీవుల బతుకులను కరోనా కకావికలం చేస్తోంది. స్వీయ నిర్బంధం తప్ప మరో మందు లేని ఈ వైరస్ వల్ల అనేక వర్గాలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాయి. వారిలో ఆటో డ్రైవర్లు ఉన్నారు. రెక్కాడితేనేగాని డొక్కాడని బతుకులకు కరోనా రూపంలో కష్టాలు వచ్చిపడ్డాయి. లాక్ డౌన్ కారణంగా పది రోజుల నుంచి బతుకు చక్రం మొరాయిస్తోంది. దీంతో ఇండ్లకే పరిమితమవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒకవైపు కుటుంబ కనీస అవసరాలు, మరోవైపు నెలవారీ ఫైనాన్స్ లు ఎలా చెల్లించాలో తెలియక ఆయోమయానికి గురవుతున్నారు. ఆటోలోనే నమ్ముకొని జీవనం సాగిస్తున్న చిన్న బతుకులు చితికి పోతున్నాయి. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో సుమారు 1.5 లక్షల ఆటోలున్నాయి.ఆటోలను నమ్ముకొని ప్రత్యక్షంగా,పరోక్షంగా రెండు లక్షల కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ఒక ఆటో డ్రైవర్ సగటున రోజుకు 100 నుంచి 150 కిలో మీటర్ ల వరకు ఆటో నడిపితే రూ.800 నుంచి రూ.1200 వరకు లభిస్తాయి. సొంత ఆటో ఉన్నవారైతే ఫైనాన్స్ కోసం కొంత మొత్తం కేటాయించాలి. అద్దెకు ఆటో నడిపితే యజమానికి రూ.300 నుంచి రూ.400 వరకు చెల్లించాలి. దీనికి తోడు ఇంధనం, గ్యాస్ ఖర్చులు ఆదనంగా ఉంటాయి. ఈ ఖర్చులన్నీ పోను చివరకు రూ.500 నుంచి రూ.700 వరకు మిగిలేవి.ఇలా ఏ రోజుకు వచ్చే ఆదాయంతో ఆరోజే బతుకు బండి నడిచేది. కానీ లాక్ డౌన్ కారణంగా గత 10 రోజులుగా ఆటో వాలాల పరిస్థితి ఆగమ్య గోచరంగా తయారైంది. బతుకు భారం..నగరంలో ఆటోవాలాల ఆకలి కేకలు వినిపిస్తున్నాయి. కుటుంబ అవసరాలు, ఇంటి అద్దెలు, ఆటో ఫైనాన్స్ లు తీర్చలేక నానా అవస్థలు పడుతున్నారు.పెరిగిన నిత్యావసర వస్తువులను కొనలేక తినలేక వస్తులుండాల్సిన పరిస్థితి నెలకొంది. బియ్యం, పప్పులు, వంటనూనె,కూరగాయలు, గ్యాస్ తదితర ఖర్చుల కోసం నెలకు రూ.5వేల పైనే అవుతోందని సుభాష్ నగర్ కు చెందిన ఆటో డ్రైవర్ యాదగిరి వాపోతున్నాడు. ఇకపోతే బస్తీలలో రెండు గదులు ఉన్న ఇంటి అద్దె కనీసం రూ.5000 నుంచి రూ.8000 వేలు చెల్లించాల్సి వస్తోంది. ఇక ఇతరాత్ర ఖర్చులు తలకు మించిన భారంగా మారాయి. లాక్ డౌన్ కారణంగా ఉదయం 6 గంటలకు రోడ్డుపైకి వస్తే..ఒకటి అరా గిరాకి వస్తున్నాయి. లేదంటే తిరిగి 10 గంటలలోపు ఉట్టి చేతులతోనే ఇంటికి వెళ్లాల్సి వస్తుందని బోయిన్ పల్లికి చెందిన కిరణ్ వాపోతున్నాడు. లాక్ డౌన్ కాలంలో ప్రభుత్వం ఆదుకోవాలని ఆటో డ్రైవర్లు ధీనంగా అడుగుతున్నారు. కరోనా భారిన చాలా మంది డ్రైవర్లు, వారి కుటుంబాలు కరోనా భారిన పడ్డాయని, వైద్యం కోసం తెలిసిన వారి వద్ద అప్పులు చేసినట్లు అల్వాల్ కు చెందిన వెంకటేశ్ చెబుతున్నాడు. ఒకవైపు బతుకు బండిని లాగడం.. మరోవైపు కరోనా మహమ్మారి నుంచి బయట పడేందుకు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నట్లు వాపోతున్నాడు. ఇలాంటి విపత్కర పరిస్థితులలో ఆటో డ్రైవర్లు, వారి కుటుంబాలు అపన్నహస్తం కోసం ఎదిరి చూస్తున్నాయి. ప్రభుత్వం ప్రతి ఆటో డ్రైవర్ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతున్నారు. ఇంటి అద్దెలు, ఆటో ఫైనాన్స్ ల భారం పడకుండా ప్రభుత్వమే తగు చర్యలు తీసుకోవాలని అంటున్నాయి

# మండలి ఛైర్మన్ పై జగన్ గురి

విజయవాడ, మే 24, (న్యూస్ పల్స్)రాష్ట్రంలో ఈ రకమైన రాజకీయ వాతావరణం ఎపుడూ లేదు. పదవులు అన్నీ కూడా వరసపెట్టి ఒకే పార్టీకి దక్కడం అన్నది జగన్ సృష్టించిన సరికొత్త రికార్డుగా చెప్పుకోవాలి. పంచాయతీ వార్డు మెంబర్ నుంచి పార్లమెంట్ సభ్యుడి దాకా వైసీపీ నేతలే పదవుల్లో నూటికి తొంబై అయిదు శాతం ఉంటున్నారు. ఇక ఏపీలో పెద్దల సభ కూడా రెండు నెలలు ఆగితే వైసీపీ పరం అవడం ఖాయం. అంతే కాదు క్యాబినెట్ ర్యాంక్ హోదా కలిగిన మండలి ఛైర్మన్ కూడా వైసీపీ నుంచే ఉంటారు. అలాగే డిప్యూటీ ఛైర్మన్ కూడా అదే పార్టీకి చెందిన వారు ఉంటారు.ఇక ఏపీ మండలిలో మొత్తం 58 మంది సభ్యులు ఉంటే సగానికి పైగా టీడీపీకి చెందిన ఎమ్మెల్సీలు ఇప్పటిదాకా ఉండేవారు. కేవలం ఒకరిద్దరు ఎమ్మెల్సీలతో పెద్దల సభలో అడుగుపెట్టిన వైసీపీ జూన్ 18 తరువాత ఏకంగా 30 మంది సభ్యులతో పూర్తి మెజారిటీ సాధిస్తుంది. అదే సమయంలో టీడీపీ బలం దారుణంగా పడిపోతుంది. లోకేష్, యనమల వంటి వారు తప్ప మిగిలిన వారు కూడా 2023 నాటికి రిటైర్ అయిపోక తప్పదు. ఇలా మండలిలో గుత్తమొత్తంగా పెత్తనం వైసీపీ పరం కావడంతో అక్కడ చాలా పదవులు వారికి దక్కుతాయి.మండలి ఛైర్మన్ గిరీ మీద చాలా మంది పెద్దల కన్ను ఇపుడు పడుతోంది అంటున్నారు. మండలి ఛైర్మన్ గా హాయిగా అధికారాన్ని అనుభవించే యోగాన్ని ఎవరు కాదనుకుంటారు. అందుకే ఇప్పటి నుంచే ఎవరి లెవెల్ లో వారు లాబీయింగ్ మొదలెట్టేశారు. అయితే జగన్ మదిలో ఎవరు ఉన్నారు అన్నదే అందరికీ అంతు పట్టని ప్రశ్న. జగన్ తీరు చూస్తే ఆయన ఎవరు పేరుని తన మనసులో ఉన్నది బయట పెట్టరు. చివరి నిముషంలో అనూహ్యంగా ఆయన నిర్ణయం తీసుకుంటారు. దాంతో అంతా షాక్ తినాల్సిందే. ఇపుడు కూడా అలాగే జరుగుతుందా అన్నదే ఆశావహులను పట్టి పీడిస్తున్న బెంగగా ఉందిట.ఇప్పటిదాకా నియామకాలు జరిగిన పదవుల విషయంలో జగన్ సెలెక్షన్ చూసిన వారికి ఒక విషయం మాత్రం స్పష్టంగా అర్ధమవుతోంది. ఆయన బీసీలు, ఎస్సీలు, మైనారిటీల పక్షపాతిగానే ఉంటూ వస్తున్నారు. అదే విధంగా మహిళలకు కూడా అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారు.

## పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల గృహ నిర్బంధం

పాలకొల్లు పాలకొల్లు ఎం ఎల్ ఏ నిమ్మల రామానాయుడు సైకిల్ పై వార్డు, గ్రామాల్లో పర్యటించకుండా అడ్డుకునేందుకు పోలీసులు అయనను గృహ నిర్బంధం చేసారు. సోమవారం తెల్లవారుజామునుంచి ఆయన ఇంటిని పోలీసులు చుట్టుముట్టారు. సోమవారం నాడు అయన ఏలూరు లో ని ప్రభుత్వ ఆసుపత్రి, ఆశ్రమం ఆసుపత్రి లను సందర్శించవలసి ఉండగా అడ్డుకొనేందుకు హౌస్ అరెస్ట్ చేసారు. పట్టణ సిఐ సిహెచ్ ఆంజనేయులు సారధ్యంలో ఎస్ఐ రెహమాన్,పాలవలస వెంకట అప్పారావు సిబ్బంది ఆయన గృహాన్ని చుట్టుముట్టారు

## అమరనాధ రెడ్డి హౌస్ అరెస్టు

పలమనేరు కోవిడ్ బాధితుల పరామర్శ మరియు సమస్యలు తెలుసుకోవడం కోసం రాష్ట్ర తెలుగుదేశంపార్టీ నలుగురు సభ్యుల బృందం ఏర్పాటు చేసిన నేపథ్యంలో ఈరోజు పలమనేరు ఏరియా ఆసుపత్రి సందర్శన కోసం వెళ్లనున్న మాజీ మంత్రి.ఎన్.అమర నాధ రెడ్డిను పపలమలనేరు పోలీసులుగృహ నిర్బంధం (హౌస్ అరెస్ట్) చేసారు. ఈ సందర్భంగా ఆయనమీడియాతో మాట్లాడుతూ నిజాలు బయటకు వస్తాయనే భయంతోనే మమ్మల్ని గ్రహనిర్బంధం చేస్తున్నారని అన్నారు .అలాగే కోవిడ్ కట్టడిలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందింది. వ్యాక్సిన్ కూడా వేయించలేని పరిస్థితులలో ప్రభుత్వం ఉంది అని విమర్శించారు.అలాగే ప్రజల ప్రాణా లు గాలికొదిలి ప్రతిపక్ష నేతల అరెస్ట్ సిగ్గుచేటు అని ఆయనఅన్నారు. ముఖ్యమంత్రి జగన్ కరోనా విపత్కర పరిస్థితుల్లో కూడా ప్రజల ఆరోగ్యంపై ద్రుష్టి పెట్టడం మాని ప్రతిపక్ష నేతలపై అక్రమ కేసులు పెట్టడమే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారు.అకారణంగా తెలుగుదేశం పార్టీ నేతలపై అక్రమ కేసులు బనాయిస్తూ వేధింపులకు గురిచేస్తున్న జగన్మోహన్ రెడ్డికి బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయి. అధికారం శాశ్వతం కాదనే విషయాన్ని జగన్ తెలుసుకోవాలి. కరోనాను నియంత్రించేదానికన్నా ప్రతిపక్షాలను నియంత్రించడమే లక్ష్యంగా జగన్ వ్యవహరిస్తున్నారు.రాష్ట్రంలో వైసీపీ పాలన తీరు మూడు అక్రమ కేసులు ఆరు అరాచకాలు అన్నట్లుగా సాగుతోందని ఆయన విమర్శించారు.

## సిపిఐ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో డి. టి కి వినతి పత్రం

దర్శి ప్రకాశం జిల్లా దర్శి మండలం లో ఎన్.ఆర్.ఇ.జి.ఎస్ పథకం ద్వారా సుమారు 13వేల మంది ఉపాధి హామీ పథకం ద్వారా జాబ్ కార్డులు కలిగి ఉన్నారని వారిలో దర్శి పట్టణమునకు చెందిన వారు సుమారు 270 గ్రూపులలో మూడు వేల మంది కూలీలు ఉన్నారని వారికి తక్షణమే ఉపాధి హామీ పథకం పనులను అమలు చేయాలని దర్శి తహసిల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసిల్దార్ కు వినతి పత్రం అందజేశారు.దర్శి పట్టణమును 2020 వ సంవత్సరంలో మున్సిపాలిటీగా చేయడం వల్ల కూలి పనుల పై జీవనం కొనసాగిస్తున్నా సుమారు 150 కుటుంబాలు అర్ధాకలితో జీవనం గడుపుతున్నారు అని తక్షణమే వారిని ఆదుకోవాలని ప్రజాసంఘాల నాయకులు జూపల్లి కోటేశ్వరరావు కోరారు.దర్శి నగర పంచాయతీ గా మారిన అప్పటి నుండి ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా పనులు సరిగ్గా కల్పించడం లేదని వెంటనే వాటిని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.సుమారు 270 గ్రూపులలో 150 పైగా కుటుంబాలవారు రెక్కాడితే గాని డొక్కాడని స్థితిలో ఉన్న అటువంటి వారిపై ఉపాధి హామీ పనులు వలన వారి ఆర్థిక పరిస్థితి దుర్భరం అయిందని తెలిపారు.దర్శి నగర పంచాయతీ పరిధిలోని శివరాజ్ నగర్, సాయి నగర్, ఏకలవ్య నగర్, శాంతినగర్, పుచ్చల మెట్ల వారు అధికంగా ఉన్నారని వారికి పనులు లేని సమయంలో నిరుద్యోగ భృతి ని కూడా కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ నేత రమేష్ బాబు, ఆంగ్రూ టైం స్కేల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జూపల్లి కోటేశ్వరరావు, సిపిఐ నాయకురాలు సి. హెచ్. అరుణ, నరసింహం, వి. వెంకటేశ్వర్లు, ఎం. సుశీల, సావిత్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఆశా వర్కర్స్ కు శానిటేజర్స్,మాస్కు లు ఇవ్వాలి

దర్శి కరోనా ఫంట్ లైన్ వారియర్స్ గా పనిచేస్తున్న ఆశా కార్యకర్తలకు కనీసం గ్లౌజులు, శానిటేజర్స్, మాస్క లు ఇవ్వకపోవడం దారుణం అని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు జాలా సుశీలా అన్నారు.ఆశా కార్యకర్తలకు కరోనా బీమా పథకం 50 లక్షలు అమలు చేయాలని , కరోనా వచ్చిన ఆశాలకు,కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్యం అందించాలని, కరోనా తో భర్తలను కొల్పొయిన ఆశాలకు ఆర్థిక సహాయం చేయాలని , రక్షణ పరికరాలు ఇవ్వాలని , 10 వేలు వేతనం ఒకసారిగా ఇవ్వాలని , 2020 సంవత్సరంలో కరోనా సహాయం జనవరి నుంచి జూన్ వరకు నెలకు 6 వేలు పెండింగ్ అలవెన్స్ ఇవ్వాలని , ప్రభుత్వ పథకాలు ఆశాలకు అమలు చేయాలని, తదితర సమస్యలను పరిష్కరించాలని కోరుచూ ఈరోజు దరిశి తాహాశీల్దార్ ఆఫీసు వద్ద నల్ల రిబన్ల్ , చున్నీలతో నిరసన తెలిపి ధర్నా నిర్వహించారు. అనంతరం డిమాండ్స్ తో కూడిన వినతిపత్రం తాహాశీల్దార్ వరకు మార్ కి సమర్పించారు.తాహాశీల్దార్ మాట్లాడుతూ వెంటనే రక్షణ పరికరాలను అందించే ఏర్పాట్లు చేస్తామని , కరోనా వచ్చిన ఆశాలకు ,వారి కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్యం అందిస్తామని ,మిగతా సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాల్సినవి పై అధికారులకు పంపిస్తామని తెలిపారు.ఈకార్యక్రమంలో దరిశి మండల అధ్యక్ష, కార్యదర్శి నాగమణి, సుశీలా ,పద్మావతి ,జయలక్ష్మి , అంజలి ,సుభాషిణి ,లక్షిదేవి, సిఐటియు నాయకులు తాండవ రంగారావు, ఈమని నాగేశ్వరరావు, ఉప్పు నారాయణ, షేక్ భాషా పాల్గొన్నారు.

## ఈ సారైనా రైతులకు కల్తీ లేని పత్తి విత్తనాలు లబించేనా

నంద్యాల రైతే రాజు రైతే దేశానికి వెన్నెముక అని పలువురు రాజకీయ నాయకులు అధికారులు అంటుంటారు. అది నిజమో కాదో తెలియదు కానీ రైతుల కస్టాలు వర్ణనాతీతం. రైతు కల్తీలతో చాలా ఇబ్బందులు పడుతున్నారని అందరికీ తెలిసిందే . విత్తనాలు కల్తీ. పురుగు మందు కల్తీ . దళారులు మోసం చేయడం. వీటన్నింటినీ తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకున్న వారి కుటుంబాలు చాలా ఉన్నాయి. ఇవే కాకుండా పక్రుతి సహకరించక పోవడం. అధికారులు కల్తీ చేసే మోసగాళ్ళ వుచ్చులో పడి వారు ఇచ్చు లంచాలు అలవాటు పడి రైతులకు తీరని అన్యాయం చేస్తున్నారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు . ఇన్ని జరుగుతున్నా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు . కల్తీ లేని విత్తనాలు కల్తీ లేని పురుగుల మందు సమాజంలో లబించినప్పుడే రైతులు ఆత్మహత్యలు తగ్గుతాయని పలువురు రైతులు అంటున్నారు.

# ధూళిపాళ నరేంద్రకు బెయిల్

విజయవాడ, మే 24, (న్యూస్ పల్స్)టీడీపీ సీనియర్ నేత, పొన్నూరు మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకు హైకోర్టులో ఊరట లభించింది.సంగం డెయిరీ కేసులో అరెస్టయిన ఆయనకు ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఆయనతో పాటు సంగం డెయిరీ ఎండీ గోపాలకృష్ణకు కూడా బెయిల్ లభించింది. సంగం డెయిరీలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలతో అవినీతి నిరోధక శాఖ అధికారులు ధూళిపాళ్ల నరేంద్రను ఏప్రిల్ 23న అరెస్ట్ చేశారు.బెయిల్ కోరుతూ ధూళిపాళ్ల నరేంద్ర హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై గతంలోనూ వాదనలు విన్న న్యాయస్థానం తీర్పును సోమవారానికి వాయిదా వేసింది. నరేంద్రతో పాటు గోపాలకృష్ణకు బెయిల్ మంజూరు చేస్తూ తాజాగా ఉత్తర్వులు ఇచ్చింది. రూ. లక్ష పూచీకత్తుతో పాటు ఇద్దరు వ్యక్తుల షూరిటీ ఇవ్వాలని, నాలుగు నెలల పాటు విజయవాడలోనే ఉండాలని న్యాయస్థానం షరతులు విధించింది. విజయవాడలో ఎక్కడ ఉ ఓటున్నది విచారణ అధికారికి సమాచారం ఇవ్వాలని ఆదేశించింది. ధూళిపాళ్ల నరేంద్రను మళ్లీ విచారించాలనుకుంటే 24 గంటల ముందే ఆయనకు సమాచారం ఇవ్వాలని ఏసీబీ అధికారులను హైకోర్టు ఆదేశించింది. కరోనా బారిన పడిన ధూళిపాళ్ల నరేంద్ర ప్రస్తుతం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో ఐసోలేషన్‌లో ఉన్నారు.

# సుప్రీం కోర్టుకు బెంగాల్ ఇష్యూ

న్యూఢిల్లీ, మే 24, (న్యూస్ పల్స్)నారద ముడుపుల కేసులో అరెస్టయిన ఇద్దరు బెంగాల్ మంత్రులు, ఓ ఎమ్మెల్యే సహా నలుగురు నేతలకు హైకోర్టు గృహనిర్బంధం విధించిన విషయం తెలిసిందే. ఈ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన సీబీఐ.. సుప్రీంకోర్టులో సోమవారం సవాల్ చేసింది. నలుగురు నేతల బెయిల్ పిటిషన్ విషయంలో డివిజన్ బెంచ్ భిన్నాభిప్రాయం వ్యక్తం చేయడంతో ఐదుగురు న్యాయమూర్తుల విస్తృత ధర్మాసనానికి అప్పగించింది.విస్తృత ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టనుంది. ఈ నేపథ్యంలో బెయిల్ పిటిషన్‌కు రద్దుచేసేలా ధర్మాసనాన్ని ఆదేశించాలని సీబీఐ సుప్రీంకోర్టును కోరింది. ఈ పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం సోమవారం విచారణ చేపట్టనుంది. మంత్రులు ఫిర్హాద్ హకీమ్, సుబ్రతా ముఖర్జీ, టీఎంసీ ఎమ్మెల్యే మదన్ మిత్రా, ఆ పార్టీ మాజీ నేత సోవన్ ఛటర్జీలను గత సోమవారం సీబీఐ అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే.కోవిడ్-19పై పోరులో కీలకంగా వ్యవహరిస్తోన్న మంత్రి హకీమ్‌ను ఇంటి నుంచి పనిచేయడానికి హైకోర్టు అనుమతించింది. సీబీఐ అరెస్ట్ చేసిన నలుగురికి మధ్యంతర బెయిల్ ఇవ్వడానికి హైకోర్టు డివిజన్ బెంచ్ నిరాకరించింది. చీఫ్ జస్టిస్ రాజేశ్ బిందాల్ గృహనిర్బంధం సిఫార్సు చేయగా.. మరో న్యాయమూర్తి జస్టిస్ అరిజిత్ బెనర్జీ బెయిల్ ఇవ్వాలని అన్నారు.ఇరువురు న్యాయమూర్తులు వేర్వేరు అభిప్రాయాలు వ్యక్తం చేయడంతో చివరిగా గృహనిర్బంధం కొనసాగించాలని నిర్ణయించారు. సోమవారం అరెస్టయిన నలుగురిలో మంత్రులకు అదే రోజు మధ్యాహ్నం సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసింది. అయితే, దీనిపై సీబీఐ కలకత్తా హైకోర్టును ఆశ్రయించడంతో బెయిల్ రద్దు చేసింది. నిందితులు బయట ఉంటే సాక్షులను ప్రభావితం చేస్తారని సీబీఐ వాదించింది. అంతేకాదు, ఈ కేసును వేరే రాష్ట్రానికి బదిలీచేయాలని కోరింది.నలుగురు నేతల అరెస్ట్‌తో బెంగాల్ రాజకీయాలు మరోసారి వెడెక్కాయి. మంత్రులను అరెస్ట్ చేయడంపై సీఎం మమతా బెనర్జీ అగ్గిమీద గుగ్గిలమయ్యారు. ఆమె నేరుగా సీబీఐ కార్యాలయానికి చేరుకుని నిబంధనలు పాటించకుండా ఎలా అరెస్టు చేస్తారని ప్రశ్నించారు. తనను కూడా అరెస్ట్ చేయాలని సీబీఐకి సవాల్ విసిరారు.

# విమానంలో పెళ్లి.. సిబ్బందిపై సస్పెన్షన్

చెన్నై, మే 24, (న్యూస్ పల్స్)తమిళనాడుకు చెందిన ఓ జంట తమ పెళ్లిని వినూత్నంగా జరుపుకుని వార్తల్లోకి ఎక్కింది. అయితే, కరోనా నిబంధనలను గాలికొదిలేయడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మధురైకి చెందిన ఓ జంట విమానంలో వివాహం జరుపుకుంది. జీవితంలో ఒక్కసారి జరిగే ఈ వేడుకను కలకాలం గుర్తిండిపోయేలా ఖర్చుకు వెనుకాడకుండా ఏకంగా ఓ విమానాన్నే అద్దెకు తీసుకున్నారు. బంధుమిత్రులతో కలిసి స్పైస్ జెట్‌కు చెందిన విమానంలో మధురై నుంచి తూత్తుకూడికి వెళ్లారు. విమానం గాల్లో ఉండగానే వివాహ తంతు జరిపించారు.కరోనా మహమ్మారి ఉద్ధృతంగా ఉన్న సమయంలో జరిగిన ఈ పెళ్లిలో ఎక్కడా కోవిడ్ మార్గదర్శకాలు పాటించలేదు. తమిళనాడులో అమలవుతున్న నిబంధనల ప్రకారం.. వివాహ వేడుకకు అతిథులు 50 మందికి మించరాదు. కానీ, ఏకంగా విమానంలో 161 మంది ఎక్కడంతో క్రిక్కిరిసిపోయింది. అలాగే, వధూవరులతోపాటు అతిథులు కూడా మాస్క్ ధరించలేదు. మాస్కుల్లేకుండానే మాంగల్యధారణ జరిగింది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) ఆగ్రహం వ్యక్తం చేసింది.కరోనా నిబంధనలు గాలికొదిలేసి వివాహ వేడుకలేంటని అసంతృప్తి వ్యక్తం చేసిన డీజీసీఏ.. దీనిపై విచారణకు ఆదేశించింది. పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలంటూ స్పైస్ జెట్, ఎయిర్ పోర్ట్ వర్గాలను ఆదేశించింది.

# వేసవిలో వ్యాయామం చేసేటప్పుడు గుర్తుంచుకోవలసిన విషయాలు ఇక్కడ ఉన్నాయి



వాతావరణంలో పెరుగుతున్న ఎండలు , వేడి ఇంటి నుండి బయటపడటం కష్టం. ఇటువంటి సమయంలో పునరావృత వ్యాయామాలను నివారించలేము. వ్యాయామం తప్పనిసరిగా చేయవలసిన దినచర్య. వేసవిలో తేలికపాటి వ్యాయామం చేయకపోతే, ఇది పక్షవాతం, వికారం, తలనొప్పి మరియు నిర్జలీకరణానికి దారితీస్తుంది. కాబట్టి ఈ వ్యాసంలో వేసవిలో వ్యాయామం చేసేటప్పుడు గుర్తుంచుకోవలసిన కొన్ని ఆలోచనలను మేము ప్రస్తావించాము. దీన్ని అనుసరించడం ద్వారా మీరు వ్యాయామం చేయవచ్చు.వేసవి వ్యాయామం సమయంలో అనుసరించాల్సిన కొన్ని చిట్కాలు ఇక్కడ ఉన్నాయి:రోజు ఈ సమయంలో వ్యాయామం మానుకోండి:ఉదయం 10 నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు వ్యాయామం చేయకుండా ఉ ఒడటానికి ప్రయత్నించండి. వేసవిలో పని చేయడానికి ఉత్తమ సమయం ఉ దయాన్నే. మీరు త్వరగా లేవలేకపోతే, సూర్యాస్తమయం సమయంలో లేదా తరువాత వ్యాయామం చేయండి. మీరు బయటకు వెళ్ళే ముందు వాతావరణ సూచన ఉందని నిర్ధారించుకోండి. మీరు అధిక వాయు కాలుష్యాన్ని అనుభవిస్తే, మీ ఊపిరితిత్తులను రక్షించడానికి ఇంట్లో వ్యాయామం చేయండి.కరోనావైరస్: ఊపిరి అందకపోవడం సంకేతాలను ఎలా గుర్తించాలికరోనావైరస్: ఊపిరి అందకపోవడం సంకేతాలను ఎలా గుర్తించాలివదులుగా ఉండే దుస్తులు ధరించండి:ముదురు రంగులు వేడిని గ్రహిస్తాయి, తేలికపాటి రంగులు వేడిని ప్రతిబింబిస్తాయి. కాబట్టి, లేత రంగు దుస్తులు ధరించండి. టైట్ దుస్తులు మీకు వేడిని మరింత పెంచుతాయి, ఇది అసౌకర్యాన్ని కలిగిస్తుంది మరియు మీ శ్వాసను అడ్డుకుంటుంది. మీ చర్మంపై ఎక్కువ గాలి ప్రసరించడానికి బట్టలు వదులుగా ఉంచండి మరియు మిమ్మల్ని మీరు చల్లగా ఉంచండి. ఆరుబయట వ్యాయామం చేసేవారికి కాటన్ దుస్తులు చాలా బాగుంటుంది ఎందుకంటే ఇది చెమటను బాగా గ్రహించడంలో సహాయపడుతుంది.కరోనా రోగుల్లో కనిపించే అత్యవసర లక్షణాలు: ఎంత త్వరగా ఆసుపత్రికి వెళితే అంత త్వరగా కోలుకుంటారు..కరోనా రోగుల్లో కనిపించే అత్యవసర లక్షణాలు: ఎంత త్వరగా ఆసుపత్రికి వెళితే అంత త్వరగా కోలుకుంటారు..సన్‌స్క్రీన్ లేకుండా బయటకు వెళ్లవద్దు:వేసవి లేదా శీతాకాలం లేదా మేఘావృతంతో సంబంధం లేకుండా, మీరు బయట వ్యాయామం చేస్తుంటే, ఎల్లప్పుడూ చర్మానికి సన్‌స్క్రీన్ రాసుకోండి, 30 లేదా అంతకంటే ఎక్కువ ాఖఈ తో మళ్లీ దరఖాస్తు చేసుకోండి మరియు రెండు గంటలు. సన్ బర్న్ అకాల చర్మం వృద్ధాప్యం, అలాగే చర్మ క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతుంది. రక్షిత దుస్తులు ధరించడం సూర్యుడి వేడిని తగ్గించడానికి మరొక గొప్ప మార్గం.కరోనా వ్యాక్సిన్ తీసుకునే ముందు మరియు ఆ తరువాత మీరు ఏ ఆహారాలు తినాలో మీకు తెలుసా? కరోనా వ్యాక్సిన్ తీసుకునే ముందు మరియు ఆ తరువాత మీరు ఏ ఆహారాలు తినాలో మీకు తెలుసా?మీరు బయటకు వెళ్ళినప్పుడు నీటి బాటిల్ పట్టుకెళ్ళండిమీ బహిరంగ వ్యాయామం కోసం బయలుదేరే ముందు, ఒక గ్లాసు లేదా రెండు గ్లాసుల నీరు త్రాగాలి. మీకు దాహం లేకపోయినా, ప్రతి 15 నిమిషాలకు ఒకసారి త్రాగాలి. దీని కోసం వాటర్ బాటిల్ కొనండి. వ్యాయామం తర్వాత ఎక్కువ త్రాగాలి. ఎలక్ట్రోలైట్ తాగడం మర్చిపోవద్దు. సాధారణంగా కేలరీలు నిండిన స్పోర్ట్స్ డ్రింక్స్ మానహెచ్చరిక సంకేతాలను మీరు మైకము, మూర్ఛ లేదా వికారం అనుభవించే స్థితికి చేరుకునేంత తగినంత, తేలికపాటి తలనొప్పి, మైకము, తలనొప్పి, కండరాల నొప్పులు, వికారం లేదా వాంతులు, వేగవంతమైన హృదయ స్పందన వంటి సంకేతాలు

# చరిత్ర సృష్టించిన గోల్ఫ్ ప్లేయర్ ఫిల్ మికెల్సన్..

క్రైవా ఐల్యాండ్: గోల్ఫ్ ప్లేయర్ ఫిల్ మికెల్సన్ చరిత్ర సృష్టించాడు. 50 ఏళ్ల వయసులో అమెరికా పీజీఏ గోల్ఫ్ చాంపియన్‌షిప్‌ను గెలుచుకున్నాడు. పీజీఏ టైటిల్‌ను 50 ఏళ్ల వయసులో గెలుచుకున్న తొలిప్లేయర్‌గా రికార్డు క్రియేట్ చేశాడు. మికెల్సన్ కెరీర్‌లో అతనికి ఇది ఆరవ మేజర్ టైటిల్ కావడం విశేషం. 2013లో బ్రిటీష్ ఓపెన్ నెగ్గిన తర్వాత ఆయనకు ఇదే తొలి టైటిల్. 1968లో పీజీఏ చాంపియన్‌షిప్‌ను జూలియస్ బోరస్ అనే ప్లేయర్ 48 ఏళ్ల వయసులో గెలిచాడు. టోర్నీ ఫైనల్ రోజు ఆటను తిలకించేందుకు భారీ సంఖ్యలో ప్రేక్షకులు క్రైవా ఐల్యాండ్‌కు చేరుకున్నారు. వచ్చే నెలలో జరగనున్న అమెరికా ఓపెన్ టోర్నీలో ఫిల్ మికెల్సన్ ఫేవరేట్‌గా బరిలోకి దిగనున్నారు. మికెల్సన్ విజయం పట్ల మేటి గోల్ఫ్ ప్లేయర్ టైగర్ వుడ్స్ రియాక్ట్ అయ్యారు.

# ఏక్ మినీ కథ చిత్రబృందానికి పాన్ ఇండియా స్టార్ విషెస్..!



టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థలలో ఒకటైన యూవి క్రియేషన్స్ బ్యానర్ లో ఓవైపు భారీ బడ్జెట్ సినిమాలు రూపుదిద్దుకుంటున్నాయి. మరోవైపు యూవి వారి సెకండ్ ప్రొడక్షన్ హౌస్ యూవి కాన్సెప్ట్స్ బ్యానర్ పై చిన్న సినిమాలకు ఆస్కారం లభిస్తుంది. అయితే యూవి కాన్సెప్ట్స్ బ్యానర్ లో మొదటి సినిమాగా తెరకెక్కింది ఏక్ మినీ కథ. ఈ మూవీ ఇంతవరకు తెలుగు సినిమాల్లో ప్రస్తావించని ఓ బోల్డ్ పాయింట్ తో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఇప్పటికే టీజర్ ట్రైలర్ చూసిన వారికిఏక్ మినీ కథ కాన్సెప్ట్ అర్థం అయ్యేంటుంది. డస్ సైజ్ మేటర్..? అనే బోల్డ్ పాయింట్ నేపథ్యంతో రూపొందిన ఈ సినిమాలో సంతోష్ శోభన్ కావ్య తపర్ హీరో హీరోయిన్లుగా నటించారు. అయితే తాజాగా ఈ ట్రైలర్ తో పాటుగా రిలీజ్ డేట్ అనౌన్స్ చేశారు మేకర్స్.ట్రైలర్ అయితే సినిమా పై ఆసక్తి రేపే విధంగానే ఉంది. ఎందుకంటే యూత్ ఫుల్ అంశాలు సినిమాలో పుష్కలంగా ఉన్నాయని ట్రైలర్ చూస్తే అర్థమవుతుంది. అయితే మరి ఇంత బోల్డ్ పాయింట్ థియేటర్స్ లో చూస్తే ఎలా ఉంటుందో తెలియదు కానీ మేకర్స్ మాత్రం సినిమాను ఓటిటిలో రిలీజ్ చేస్తున్నారు. డైరెక్టర్ మేర్లపాక గాంధీ ఈ సినిమాకు కథను అందించగా.. ఆద్యంతం ఎంటర్టైన్మెంట్ తో పాయింట్ చెప్పే ప్రయత్నం చేశారు మేకర్స్. అలాగే కామెడీ కూడా యూత్ ను దృష్టిలో పెట్టుకొని క్రియేట్ చేసినట్లు తెలుస్తుంది. మరి ఈ సినిమా ఏప్రిల్ లో థియేట్రికల్ రిలీజ్ కావాల్సింది. కానీ కరోనా కారణంగా వాయిదాపడింది. మొత్తానికి సినిమా అమెజాన్ ప్రైమ్ లో మే 27 నుండి స్ట్రీమింగ్ కాబోతుంది.అయితే ఈ సినిమా రిలీజ్ ముందు చేయాల్సిన హడావిడి మాత్రం బాగానే చేసేసారు మేకర్స్. తాజాగా ఈ సినిమాను బెస్ట్ విషెస్ తెలుపుతూ పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టాడు. ప్రభాస్ కెరీర్ లోని బిగ్గెస్ట్ హిట్ సినిమాల్లో ఒకటి వర్షం. ఆ సినిమాను డైరెక్టర్ శోభన్ తెరకెక్కించాడు. కానీ ఆయన చనిపోవడంతో అతని కొడుకు సంతోష్ శోభన్ ఈ సినిమాలో హీరోగా నటిస్తున్నాడు. ఈ విషయం గురించి ప్రస్తావిస్తూ ప్రభాస్ పోస్ట్ పెట్టడం మనం చూడవచ్చు. వర్షం సినిమా నా కెరీర్ బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్స్ లో ఒకటి. అలాంటి సినిమా ఇచ్చినందుకు డైరెక్టర్ శోభన్ గారికి థాంక్స్. ఇప్పుడు ఆయన కొడుకు సంతోష్ శోభన్ నటించిన ఏక్ మినీ కథ సినిమా ఏప్రిల్ 27న అమెజాన్ ప్రైమ్ లో విడుదల కాబోతుంది. సంతోష్ - నా ఫ్రెండ్స్ యూవి క్రియేషన్స్ - ఎంటైర్ టీమ్ కి నా బెస్ట్ విషెస్ అంటూ ప్రభాస్ పోస్ట్ పెట్టాడు. ఈ సినిమాతో కార్తీక్ రాపోలు అనే నూతన దర్శకుడు పరిచయం అవుతున్నాడు. ప్రస్తుతం ట్రైలర్ అయితే పాజిటివ్ బజ్ క్రియేట్ చేస్తోంది.

# గుసగుస.. చరణ్ తో ఆలియా రెండోసారి..!

మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా శంకర్ దర్శకత్వంలో భారీ పాన్ ఇండియా చిత్రం తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్టును నిర్మాత దిల్ రాజు అధికారికంగా ప్రకటించారు. దాదాపు 400కోట్ల బడ్జెట్ తో ఈ చిత్రాన్ని నిర్మించనున్నారన్న టాక్ వినిపిస్తోంది. ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనులు సాగుతున్నాయి. పలు భాషల్లో ట్యాలెంటెడ్ ఆర్టిస్టుల్లో కొందరు పాపులర్ స్టార్లు ఈ చిత్రంలో నటించనున్నారు.చరణ్ సరసన నటించే కథానాయిక ఎవరు? అన్నదానిపై అభిమానుల్లో క్యూరియాసిటీ నెలకొంది. రష్మిక మందన.. కియరా అద్వాణీ.. పూజాహెగ్డే అంటూ పలువురు కథానాయికల పేర్లు ఇటీవల వినిపించాయి.కానీ శంకర్ ఆలోచన వేరుగా ఉందని తెలిసింది. హిందీ ఫిల్మ్ సర్కిల్స్ లో గుసగుసల ప్రకారం... ట్యాలెంటెడ్ హీరోయిన్ అలియా భట్ ను శంకర్ సంప్రదించారని తెలుస్తోంది. ఇదే నిజమైతే.. ఆర్.ఆర్.ఆర్ తర్వాత ఆలియా చరణ్ తో రొమాన్స్ చేయడం రెండవసారి అవుతుంది. రెండు బ్యాక్ టు బ్యాక్ పాన్ ఇండియా సినిమాల్లో జాతీయ స్థాయి క్రేజీ దర్శకులతో పని చేసే అరుదైన అవకాశం ఆలియాను వరించినట్టే. ఈ చిత్రానికి ఆలియా సంతకం చేశారా లేదా? అన్నదానిపై మరింత క్లారిటీ రావాల్సి ఉంది.






# మహేష్ కోసం త్రివిక్రమ్ స్పెషల్ స్టోరీ.. అదేనా??

సినిమా ఇండస్ట్రీలో ఏదైనా హీరో = డైరెక్టర్ కాంబినేషన్ రిపీట్ అవుతుందంటే అలాంటి సినిమాలపై అంచనాలు ఓ రేంజిలో నెలకొంటాయి. కానీ సక్సెస్ ఫుల్ కాంబినేషన్ అయితే ఒకలా ఉంటాయి. అదే ఫ్లాప్స్ పడిన కాంబినేషన్ అయితే అంచనాలు వేరేలా ఉంటాయి. కానీ ఇద్దరూ హీరో - డైరెక్టర్ సూపర్ ఫామ్ లో ఉన్నప్పుడు సినిమా ఓకే అయితే మాత్రం ఖచ్చితంగా అంచనాలు హై లెవెల్ లోనే ఉంటాయనేది నిజం. ప్రస్తుతం అలాంటి అంచనాలే క్రియేట్ చేసింది సూపర్ స్టార్ మహేష్ బాబు - డైరెక్టర్ త్రివిక్రమ్ కాంబినేషన్. ఈ కాంబోలో ఇదివరకు అతడు - ఖలేజా సినిమాలు వచ్చాయి. టాక్ పరంగా బాగానే ఉన్నప్పటికీ కమర్షియల్ గా వర్కౌట్ కాలేదని చెప్పాలి.ఆ సినిమాల్లో ఎంటర్టైన్మెంట్ తో పాటు అదిరే యాక్షన్ ఉన్నప్పటికీ సినిమాలను యావరేజ్ లెక్కల్లో పెట్టేసారు ప్రేక్షకులు. ఎంత ఫేవరేట్ హీరో - బడా డైరెక్టర్ అయినప్పటికీ ప్రేక్షకులు కూడా కథలో కంటెంట్ ఉంటేనే సినిమాను తీసుకెళ్లి అందలం ఎక్కిస్తారు. లేదనుకుంటే వారేది చేయాలో అదే చేసి చూపిస్తారు. ప్రస్తుతం మహేష్ త్రివిక్రమ్ కాంబినేషన్ పై ఎక్సపెక్టషన్స్ తో పాటు పలు సందేహాలు కూడా వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా త్రివిక్రమ్ నుండి ఓ ఎక్స్పరిమెంటల్ ఫిల్మ్ చూడాలని ఫ్యాన్స్ అభిప్రాయాలు బయటపెడుతున్నారు. కానీ తాజా సమాచారం ప్రకారం.. త్రివిక్రమ్ మహేష్ సినిమా కోసం ఓ చిన్నకథనే గతేడాది లాక్ డౌన్ నుండి రాసుకొచ్చినట్లు ఇండస్ట్రీలో టాక్ నడుస్తుంది. అది ఎలాంటి కథ అనే విషయం పక్కనపెడితే ఎక్స్పరిమెంటల్ ఫిల్మ్ కావచ్చు అని టాక్ వైరల్ అవుతోంది.ప్రస్తుతం త్రివిక్రమ్ మహేష్ సినిమా స్క్రిప్ట్ తో పాటు ప్రీ-ప్రొడక్షన్ పనులు చూసుకుంటున్నట్లు సమాచారం. అలాగే సినిమా కాస్టింగ్ కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తుంది. మరి ఈసారి మహేష్ తో ఎలాంటి సినిమా తెరకెక్కిస్తాడో అని ఫ్యాన్స్ ఆత్రంగా వెయిట్ చేస్తున్నారు. కానీ ఒకటి మాత్రం పక్కా అంటున్నారు. ఏంటంటే.. మహేష్ బాబును త్రివిక్రమ్ స్టైలిష్ గా చూపించబోతున్నాడు అని. ఎందుకంటే త్రివిక్రమ్ సినిమాల్లో అందరూ హీరోలు స్మార్ట్ అండ్ స్టైలిష్ లుక్కులో కనిపిస్తారు. అలాంటిది మహేష్ ను ఎలా చూపించగలడో గెస్ చేయగలం అంటున్నారు ఫ్యాన్స్. మరి ఈ మే 31న మహేష్ తండ్రి సూపర్ స్టార్ కృష్ణ పుట్టినరోజు. ప్రతి ఏడాది తండ్రి పుట్టినరోజున తన కొత్త సినిమా గురించి ఏదొక అప్డేట్ ఇస్తుంటాడు మహేష్. అయితే ఇప్పుడు త్రివిక్రమ్ మూవీకి సంబంధించి టైటిల్ అనౌన్స్ చేయబోతున్నారా లేదా అనేది చూడాలి.



# బన్నీ సినిమా రామ్ చేతికి.. రామ్ సినిమా వరుణ్ చేతికి..!

సినీ ఇండస్ట్రీలో ఎప్పుడు ఏమి జరుగుతుందో చెప్పలేం. ఒక స్టోరీ లైన్ సినిమాగా రూపాంతరం చెంది ప్రేక్షకుల ముందుకు రావడానికి మధ్య ఎన్నో జరుగుతుంటాయి. కొన్ని సినిమాలు చర్చల దశలోనే మరికొన్ని సినిమాలు షూటింగ్ దశలో క్యాన్సిల్ అవుతుంటాయి. అలాంటి సందర్భాలలో ఆ ప్రాజెక్ట్స్ చేతులు మారుతుంటాయి. ఎవరితోనో అనుకున్న కథలు ఇంకెవరితోనో చేయాల్సి ఉంటుంది. ఇప్పుడు టాలీవుడ్ లో రెండు క్రేజీ ప్రాజెక్ట్స్ విషయంలో ఇదే జరుగుతోంది. రెండు ఆసక్తికర కాంబినేషన్స్ మారబోతున్నాయని తెలుస్తోంది.వివరాల్లోకి వెళ్తే.. పీఎస్వీ గరుడవేగ సినిమాతో సూపర్ హిట్ అందుకున్న డైరెక్టర్ ప్రవీణ్ సత్తారు.. ఎనర్జిటిక్ హీరో రామ్ తో ఓ సినిమా అనౌన్స్ చేశాడు. ఇదొక మైనస్ 20 డిగ్రీస్ యాక్షన్ అడ్వెంచర్ అని.. ప్రవీణ్ సత్తారు డైరెక్షన్ లో చేస్తున్నందుకు ఎగ్జైటింగ్ గా ఉన్నానని రామ్ చెప్పుకొచ్చాడు. 2018లో ఈ ప్రాజెక్ట్ ని స్రవంతి బ్యానర్ లో పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభించారు. అయితే ఏమైందో ఏమో ఈ ప్రాజెక్ట్ ని పక్కన పెట్టేసారు. బడ్జెట్ ఎక్కువ అవుతుందేమోనని ఉద్దేశంతో ఈ సినిమాని క్యాన్సిల్ చేసారని అప్పట్లో వార్తలు వచ్చాయి. ఆ తర్వాత రామ్ ఇస్మార్ట్ శంకర్ రెడ్ సినిమాలకు కమిట్ అవ్వడంతో ప్రవీణ్ సత్తారు సినిమా ఇక ఉండదని అందరికీ క్లారిటీ వచ్చింది.అయితే ప్రస్తుతం కింగ్ అక్కినేని నాగార్జున తో ఓ యాక్షన్ ఎంటర్టైనర్ తెరకెక్కిస్తున్న ప్రవీణ్ సత్తారు.. తాజాగా మెగా హీరో వరుణ్ తేజ్ కు ఓ కథ వినిపించారట. స్టోరీ నచ్చడంతో వరుణ్ దీనికి గ్రీన్ సిగ్నల్ కూడా ఇచ్చారట. ఈ కథ అప్పట్లో రామ్ కోసం సిద్ధం చేసిన యాక్షన్ అడ్వెంచరే అని టాక్ నడుస్తోంది. ఇది పక్కన పెడితే గతంలో తమిళ దర్శకుడు లింగుస్వామి తో అల్లు అర్జున్ ఓ బైలింగ్వల్ మూవీ ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే ఏమైందో ఏమో ఆ ప్రాజెక్ట్ కార్యరూపం దాల్చలేదు. ఇటు బన్నీ అటు లింగుస్వామి వేరే సినిమాలతో బిజీగా ఉండటంతో వీరి ఇంక ఆ ప్రాజెక్ట్ ని పూర్తిగా వదిలించుకున్నట్లే అనే కంక్లూజన్ కి వచ్చేశారు.ఈ క్రమంలో ఇటీవల రామ్ పోతినేని - లింగుస్వామి కాంబినేషన్లో ఓ ద్విభాషా సినిమా ప్రారంభమైంది. అయితే లింగుస్వామి అప్పుడు అల్లు అర్జున్ తో చేయాల్సిన కథతోనే ఇప్పుడు రామ్ తో సినిమా చేస్తున్నాడని ఫిలిం సర్కిల్స్ లో అనుకుంటున్నారు. దీని ప్రకారం బన్నీ నటించాల్సిన కథ రామ్ చేతికి వెళ్లగా.. అలాగే రామ్ కోసం రెడీ చేసిన కథ వరుణ్ తేజ్ చేతికి వెళ్లిందనే ప్రచారం జరుగుతోంది.



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**